

నేటి దినపత్రిక

# సూర్య

www.suryaa.com

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు

05 సెప్టెంబర్ 2025 పేజీలు : 08

శుక్రవారం


# పెన్నా పొర్లు కట్టలు పటిష్టం చేయండి

- కనిగిరి రిజర్వాయర్ మట్టికట్ట, షట్టర్లు బలోపేతం చేయండి
- రానున్న రబీ సీజన్ సందర్భంగా సాగునీటి కాలువల మరమత్తులు చేయండి
- షుగర్ ఫ్యాక్టరీ రైతులతో చర్చించి కోవూరు పారిశ్రామికాభివృద్ధికి సహకరించండి
- మైపాడు వద్ద బకింగ్ హాం కెనాల్ సుందరీకరణలో ఉద్యానవన శాఖను భాగస్వామ్యం చేయండి
- కలెక్టర్ ఆనంద్‌తో ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి భేటీ



**నెల్లూరు కలెక్టరేట్, మేజర్‌న్యూస్ :**

రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకొని పెన్నానది కరకట్టలు బలోపేతం చేయాలని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి జిల్లా కలెక్టర్ ఆనంద్‌ను కోరారు. ఇప్పటికే సోమశిల జలాశయంలో 65 టీఎంసీల నీళ్లు చేరిన నేపథ్యంలో త్వరితగతిన చర్యలు తీసుకోవాలని ఆమె విజ్ఞప్తి చేశారు. గురువారం నెల్లూరు పరిధిలోని కలెక్టరేట్‌లో కలెక్టర్ ఆనంద్‌ను కలిసి ఆమె పలు విషయాలను కలెక్టర్ దృష్టికి తెచ్చారు. కనిగిరి రిజర్వాయర్ మట్టికట్టను బలోపేతం చేయడంతో పాటు.. షట్టర్లకు మరమ్మతులు చేపట్టాలని కోరారు. అలాగే రానున్న రబీ సీజన్ నేపథ్యంలో సాగు నీటి కాలువలకు మరమ్మతులు చేస్తే నీటి పారుదల సౌకర్యాలు మెరుగుపడతాయని ఆమె కలెక్టర్‌కు వివరించారు. షుగర్ ఫ్యాక్టరీ కార్మికులు, రైతుల సమస్యలను కూడా ఎమ్మెల్యే ప్రశాంతమ్మ కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు. రైతులకు సంబంధించి కేసుల విషయాలను కలెక్టర్‌తో చర్చించారు. దాంతో పాటు పీ4 కార్యక్రమం కింద మైపాడు వద్ద చేపట్టిన బకింగ్

-మిగతా 2లో

## ముందస్తు బెయిల్ కోసం
# ప్రసన్న ప్రయత్నం

**8న హైకోర్టులో విచారణ**



వివరాలు 3లో

నెల్లూరు జిల్లా కోర్టులో మందస్తు బెయిల్ కోసం ప్రయత్నించి విఫలుడైన మాజీ మంత్రి కోవూరు మాజీ ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్న కుమార్ రెడ్డి హైకోర్టు గడప తొక్కారు. రాష్ట్ర ప్రభుత్వం తనను అకారణంగా అరెస్టు చేసి భయభ్రాంతులకు గురి చేసే ఉద్దేశంతో ఉందని పేర్కొంటూ ప్రసన్న కుమార్ రెడ్డి హైకోర్టును ఆశ్రయించారు. తాజాగా మంగళవారం విచారణకు వచ్చిన పిటిషన్‌ను న్యాయమూర్తి ఈనెల 8కి వాయిదా వేశారు.

## ఆత్మకూరులో 17 దేవాలయాలకు
# రూ.85 లక్షల నిధులు

**మంత్రి ఆనంకు కృతజ్ఞతలు**



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :**

ఆత్మకూరు మున్సిపాలిటీ, ఆత్మకూరు రూరల్ మండలంలో గతంలో ఎన్నడూ లేనివిధంగా 17 దేవాలయాలకు 5లక్షల రూపా యల వంతున 85 లక్షల రూపాయల నిధులను రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామ నారాయణరెడ్డి మంజూరు చేయించారు. నిధు లు మంజూరైన దేవాలయాల అబివృద్ధికి ఈ మొత్తాన్ని వెచ్చించి వృద్ధి చేయనున్నారు. చెర్లో యడవల్లి కోదండరామ దేవస్థానానికి 5 లక్షలు, నువ్వురుపాడు కోదండరామ దేవాలయానికి 5 లక్షలు, ఆత్మకూరు పట్టణంలోని బలిజవీధిలో విఘ్నేశ్వర, జ్వాలాముఖి అమ్మవారు, అభయాంజనేయ స్వామి ఆలయానికి 5 లక్షలు, బట్టేపాడులోని మాతాపరమేశ్వరి ఆలయానికి 5 లక్షలు, ఆత్మకూరులోని శ్రీకృష్ణమందిరానికి 5 లక్షలు, 19వ వార్డులోని శ్రీరుక్మిణి సమేత పాండు రంగస్వామి ఆలయానికి 5 లక్షలు, 12వ వార్డులోని అరుంధతీయవాడలో శ్రీ రామాలయానికి 5 లక్షలు, మహిమలూరులోని శ్రీ అనంత కోదండ రామాలయంకు 5 లక్షలు, ఆరవేడు జంగాల పల్లిలోని వినాయక స్వామి ఆలయానికి 5 లక్షలు, బొటికర్ల పాడులోరి రామాలయంకు 5 లక్షలు, బండారుపల్లి కోదండ రామాలయానికి 5 లక్షలు, కనుపూరుపల్లిలోని రామాలయానికి 5 లక్షలు, అప్పారావుపాళెంలోని శ్రీరామ మందిరానికి 5 లక్షలు, ఎల్‌ఆర్‌పల్లి రామస్వామి దేవస్థానానికి 5 లక్షలు, ఆత్మకూరు 22వ వార్డులోని కోదండ రామాలయానికి 5 లక్షలు, కరటం పాడులోని శ్రీ కోదండ రామాలయానికి 5 లక్షలు, మురుగుళ్ళలోని శ్రీనాగార్పమ్మ దేవ స్థానానికి 5 లక్షల రూపాయలు నిధులను మంత్రి ఆనం రామ నారాయణరెడ్డి మంజూరు చేయించారని స్థానిక తెలుగుదేశం నాయకులు పేర్కొన్నారు. ఆత్మకూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మెన్ గొట్టిగుండాల బుజ్జిరెడ్డి, పట్టణ తెలుగుదేశం

-మిగతా 2లో

# ప్రతిభను కనపరిచిన నోమేష్



**నెల్లూరు, మేజర్‌న్యూస్ :**

నెల్లూరులో నోమేష్ అనే బాలుడు తన ప్రతిభను చాటుకున్నాడు. ఎయిమ్స్ ఇంగ్లీష్ మీడియం స్కూల్, బివి నగర్ లో ఏడవ తరగతి చదువుతున్న నోమేష్ క్యూబ్స్ మార్చుడంలో తన సత్తా చూపించాడు. నెల్లూరు జిల్లా కలెక్టర్ ఓ ఆనంద్ సమక్షంలో 13 నిమిషాల 8 సెకండ్లలో 16 క్యూబ్ లను పూర్తిచేయడమే కాకుండా క్యూబ్ లపై భారత ప్రధానమంత్రి నరేంద్రమోడీ ఫోటోను అమర్చి కలెక్టర్ ఆనంద్ కు అందజేశాడు. తన ప్రతిభను కనబరిచిన నోమేష్‌ను కలెక్టర్ అభినందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఆనంద్ మాట్లాడు తూ.. నోమేష్ క్యూబ్స్ మార్చుడంలో చక్కటి ప్రతిభను చూపించాడని కొనియాడారు. ఇదే స్ఫూర్తితో ముందుకు వెళ్లాలని మరెన్నో అద్భుతాలు సృష్టించాలని ఆకాంక్షించారు. నోమేష్ ఈ జిల్లాకు చెందిన బాలుడు కావడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఈ బాలుడిని ఆదర్శంగా తీసుకొని పిల్లలందరూ ఇలాంటి మంచి కార్యక్రమాలను ఎంపిక చేసుకొని ప్రతి ఒక్కరూ ముందుకు వెళ్లాలన్నారు. మంచి ప్రతిభను కనబరిచిన నోమేష్ కు కలెక్టర్ ఆనంద్ ఓ అవకాశాన్ని కూడా కల్పించారు.వెంకటాచలం సమీపంలో ఉన్న డిస్టిక్ సైన్స్ సెంటర్ కు ప్రతిరోజు ఎంతోమంది పిల్లలు వస్తూ వెళ్తుంటారని ఆ పిల్లలకు కూడా నోమేష్ ద్వారా క్యూబ్ లపై అవగాహన కలిపించే కార్యక్రమాన్ని నిర్వహించాలని కోరారు. పిల్లలు చదువులోనే కాకుండా ఇటువంటి మంచి కార్యక్రమాలతో ముందుకు వెళ్లాలని ఆకాంక్షించారు.

# ప్రకృతి వ్యవసాయపై అధికారులకు అవగాహన కార్యక్రమం




**నెల్లూరు రూరల్, మేజర్‌న్యూస్ :** జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు నేషనల్ మిషన్ ఆన్ నాచురల్ ఫామింగ్‌లో భాగంగా, జిల్లా వ్యవసాయ అధికారి సత్యవాణి ఆధ్వర్యంలో ఏఎన్‌జీఆర్‌ఏయూ వ్యవసాయ పరిశోధన కేంద్రం (ఏఆర్‌ఎస్), నెల్లూరులో కన్వర్జెన్స్ మీటింగ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి సత్యవాణి, డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ నాగ రాజకుమారి, ఆనిమల్ హస్బండ్రీ జిల్లా అధికారి రమేష్ నాయక్, రైతు సాధికార సమస్థా జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ రాజ్‌కుమార్, ఏడి హెచ్.అనురాధ, అడిషనల్ డీపీఎం మునిరత్నం, ఏడిఏలు, ఎంపిఓలు, రైతు సాధికార సంస్థ ప్రకృతి వ్యవసాయ అధికారులు తదితరులు పాల్గొన్నారు. ముందుగా డిస్ట్రిక్ట్ ప్రాజెక్టు మేనేజర్ రాజకుమార్ నేషనల్ మిషన్ ఆన్ నాచురల్ ఫామింగ్ గురించి క్లుప్తంగా తెలియజేశారు. అనంతరం అడిషనల్ డీపీఎం మునిరత్నం మాట్లాడుతూ.. ఇప్పటిదాకా ఎన్ని గ్రామాలలో ప్రకృతి వ్యవసాయం చేశామని, నేషనల్ మిషన్ ఆన్ నాచురల్ ఫామింగ్‌లో భాగంగా ఎన్ని గ్రామాలలో ఎన్ని క్లస్టర్లలో ప్రకృతి వ్యవసాయం చేయబోతున్నామని, ట్రైనీ ఐసిఆర్పిలను సెలెక్ట్ చేసుకున్నామని, ఎన్ఎంఎన్ఎఫ్ యొక్క ఆవశ్యకత గురించి క్లుప్తంగా తెలియజేశారు. అలాగే డీఆర్‌డి ఏపిడి నాగరాజు కుమారి మాట్లాడుతూ.. మేము ఎల్లవేళలా ప్రకృతి వ్యవసాయానికి పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని అదేవిధంగా మహిళా సంఘాల చేత బయో రిసోర్సెస్ సెంటర్లు ఓపెన్ చేయించడానికి కూడా మేము సిద్ధంగా ఉన్నామని తెలిపారు. అనంతరం ఆనిమల్ హస్బండ్రీ జిల్లా అధికారి అయిన రమేష్ నాయక్ మాట్లాడుతూ.. జిల్లా కలెక్టర్ ప్రకృతి వ్యవసాయం చేసే రైతులకు అండగా ఎవరికైతే ఆవులు ఉండి కాటిల్ షెడ్లు లేకుండా ఉన్న రైతులకు క్యాటిల్ షెడ్లు ఇవ్వమని చెప్పడం జరిగింది. అందుచేత మీరు ఎంత మంది రైతులు కాటిల్ షెడ్లు నిర్మించుకోవడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. వారి వివరాలు మాకు తెలియజేస్తే మేము వారికి కాటిల్ షెడ్లు/మినీ గోకులాలు నిర్మించేవిధంగా ప్రణాళిక రూపొందించుకుంటామని తెలియజేశారు. అనంతరం డిస్టిక్ అగ్రికల్చర్ ఆఫీసర్ సత్యవాణి మాట్లాడుతూ.. ప్రస్తుతం రైతులు అధిక మొత్తంలో ఎరువులు వినియోగిస్తున్నారని, దానిని మనం ప్రకృతి వ్యవసాయం ద్వారానే తగ్గించగలం.. కనుక వ్యవసాయ శాఖలో పనిచేస్తున్న మనం వారికి పూర్తి సహాయ సహకారాలు అందించాలని తెలియజేశారు. నేషనల్ మిషన్ ఆన్ నాచురల్ ఫామింగ్ రావటం మనకు ఎంతో మంచిదని, రాబోయే రోజులలో రైతుల చేత విచక్షణా రహితంగా ఎరువులను వినియోగించడంలో మనం కొంతవరకైనా రసాయన ఎరువులను తగ్గించడానికి ప్రణాళికలు రూపొందించాలని తెలియజేశారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఆ గ్రామాన్ని వీడని గ్రహణం - గుక్కెటి నీటి కోసం ఆక్రందన





**వింజమూరు, మేజర్‌న్యూస్ :** మనిషి జీవించడానికి ముఖ్య అవసరమైన తాగునీరు అందక ఆక్రందనగా అలమటిస్తున్నారు. కాలనీ వాసులు వారి మసకబారుతున్న జీవితాలు, వలసలు వెళుతున్న కుటుంబాలు.. పగలు, రాత్రి వారి జీవితాల్లో ఒకటిగా మారుతున్న వేళ, గుక్కెడు నీటి కోసం ఆర్తనాదాలు చెందుతున్నారు. అడవిని తలపించే ఆ గ్రామంపై అధికారులకు చిన్న చూపు. కరెంటు లేక కటిక చీకట్లో కాలం వెల్లదీస్తున్నారు. సరైన రోడ్లు లేక పాములతో సావాసం చేస్తున్నారు. భూగర్భ జలాలు పూర్తిగా ఇంకిపోయి, చేతి పంపుల్లో కూడా చుక్కనీరు రాక, ఆ గ్రామస్తులకు గొంతు ఎండుతోంది. వింజమూరు మండలం ఏకిస్తీపురం పంచాయతీ పరిధిలోని చింతలపాలెం గ్రామంలో దాదాపుగా 50 బీసీ కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయి. దాదాపుగా ఆ గ్రామం చుట్టూ ఏడు బోర్లు ఉన్నాయి. ఆ గ్రామంలో భూమిలోని నీటి లభ్యత పూర్తిగా ఇంకిపోవడంతో, అరకొరగా బోర్లు పని చేయటం వలన పూర్తి స్థాయిలో నీరు అందక ఇక్కట్లు చెందుతున్నారు. గత రెండు నెలలు నుండి ఇలాంటి పరిస్థితులు నెలకొలడంతో గ్రామంలో తాగేందుకు నీరు లేక చాలా ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్తులు తెలియజేశారు. అలాగే గ్రామంలో చాలా వరకు పశువులు, జీవాలు ఉన్నాయని, వాటికీ కూడా నీరు సరిపోక చనిపోతున్నాయని స్థానికులు వాపోతున్నారు. మా గ్రామానికి నీటి లభ్యత సౌకర్యాన్ని కల్పించాలని వారు వేడుకుంటున్నారు. ఈ విషయంపై సర్పంచ్‌ని వివరణ కోరగా.. మా గ్రామ పంచాయతీ అభివృద్ధికి కొంత మంది వ్యక్తులు అడ్డుపడుతున్నారని, గ్రామంలో నీటి సౌకర్యం కోసం తనవంతు సహాయం చేస్తానని హామీ ఇచ్చారు.

# పెన్నా పొర్లు కట్టలు పటిష్టం చేయండి

*(మొదటి పేజీ తరువాయి)*



హమ్ కెనాల్ సుందరీకరణ పనులను ఉద్యాన శాఖ అధికారులు పర్యవేక్షించి కావాల్సిన మొక్కలు, పచ్చదనం కోసం తగిన చర్యలు తీసుకోవాల్సిన అంశాన్ని కలెక్టర్ దృష్టికి తెచ్చారు. రబీ ధాన్యం సేకరణ విషయంలో మిల్ల ర్లపై పౌర సరఫరాల శాఖ అధికారులు తగిన పర్యవేక్షణ చేసేలా సహకరించాలని కోరారు. ఎమ్మెల్యే ప్రశాంతమ్మ తన దృష్టికి తెచ్చిన అంశాలపై పరిశీలించి రైతులకు ఇబ్బందులు లేకుండా పటిష్ట చర్యలు తీసుకుంటామని కలెక్టర్ చెప్పారు. కలెక్టర్‌తో భేటీలో రైతు నాయకులు విజయకృష్ణా రెడ్డి, లక్ష్మయ్య, సింగరి వీరరాఘవలు, పాకం వెంకయ్య, పెన్నా డెల్టా ఛైర్మన్ జెట్టి రాజగోపాల్ రెడ్డి, టిడిపి నాయకులు బెజవాడ వంశీకృష్ణారెడ్డి, రావెళ్ల వీరేంద్ర నాయుడు, కెవి శేషయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఆత్మకూరులో 17 దేవాలయాలకు రూ.85 లక్షల నిధులు

*(మొదటి పేజీ తరువాయి)*

అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తుమ్మల చంద్రారెడ్డి, తోడేటి వెంకటయ్య, ఆత్మకూరు మండలాధ్యక్షుడు కేతా వేణుగోపాల్‌రెడ్డి, మండల తెలుగుదేశం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శిలు సుంకర పెంచలచౌదరి, డాక్టర్ తూమాటి శశిధర్‌రెడ్డి, టిడిపి సీనియర్ నాయకుడు కేతా విజయభాస్కరరెడ్డి, రాష్ట్ర తెలుగుదేశం నాయకురాలు పులిమి శైలజారెడ్డి, ఆంధ్రప్రదేశ్‌రెడ్డి సంఘ జిల్లా అధ్యక్షుడు, నువ్వురుపాడు తెలుగుదేశం నాయకుడు కొండ్రెడ్డి రమణారెడ్డి తదితరులు మంత్రి ఆనంకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## చిలకపాడులో ఉపాధ్యాయుల దినోత్సవం



**మర్రిపాడు, మేజర్‌న్యూస్ :** మర్రిపాడు మండలంలోని చిలకపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం ఉపాధ్యాయుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా జిల్లాలోని డైట్ పల్లిపాడు కళాశాల విశ్రాంత ప్రధానోపాధ్యాయులు పి.రమేష్, మండల విద్యాశాఖ అధికారులు తిరుపతయ్య, ధనలక్ష్మి పాల్గొని విద్యార్థులకు పలు సూచనలు సలహాలు ఇచ్చారు. ఈ ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలకు సమాధ్యక్షులుగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు మారుతి కేశవ కుమార్ అధ్యక్షత వహించారు. కార్యక్రమానికి హాజరైన ముఖ్య అతిథులతోపాటు పూర్వ విద్యార్థులు సర్వేపల్లి రాధాకృష్ణన్ జీవిత విధానాన్ని వివరించడంతో ఆ ప్రసంగాలు విద్యార్థిని విద్యార్థులకు ప్రేరణ కలిగించేలా సాగాయి. అనంతరం ముఖ్య అతిథులైన రమేష్, విద్యాశాఖ అధికారులకు సన్మానం చేశారు. దీంతోపాటుగా మెమొంటోల్లను కూడా అందజేశారు. గురువుల యొక్క ప్రాధాన్యత తెలిపే సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరింప చేశాయి. కార్యక్రమానికి హాజరైన ప్రతి ఒక్కరికి సహపంక్తి భోజనాలను ఏర్పాటు చేశారు.

## జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపిక



**మర్రిపాడు, మేజర్‌న్యూస్ :** మర్రిపాడు మండలంలోని చుంచులూరు ఎస్సీ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు దొంతు రత్నయ్య జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు గురువారం ఎంపికయ్యారు. ఆయన పాఠశాలల అభివృద్ధికి, విద్యార్థుల అభ్యున్నతికి చేసిన విశిష్ట సేవలకు గుర్తింపుగా అవార్డు రావడం పట్ల వారికి మండల విద్యాశాఖ అధికారులు తిరుపతయ్య, ధనలక్ష్మి, మండలంలోని ఉపాధ్యాయులు, గ్రామస్తులు, విద్యార్థులు తదితరులు సంతోషం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలియజేశారు.

## అన్ని గృహాలకు తాగునీటి కనెక్షన్ ఉండేలా చర్యలు



**నెల్లూరు కార్పోరేషన్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు నగర పాలక సంస్థ పరిధిలోని అన్ని డివిజన్లలో తాగునీటి కుళాయి కనెక్షన్లను క్రమబద్ధీకరించి పన్నుల వసూళ్లను వేగవంతం చేయాలని కార్పొరేషన్ టిపిఆర్‌ఓ వాసుబాబు, ఇంజనీరింగ్ విభాగం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ లు శేషగిరిరావు, రహంతు జానీలు, అనిల్ కుమార్ వార్డు సచివాలయ కార్యదర్శులను ఆదేశించారు. కార్పొరేషన్ కార్యాలయం కమాండ్ కంట్రోల్ సెంటర్ విభాగంలో ఇంజనీరింగ్ విభాగం, హౌసింగ్ ,వార్డు సచివాలయ అమెనిటీస్ కార్యదర్శులతో వారాంతపు సమీక్షా సమావేశాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నగరపాలక సంస్థ పరిధిలోని అన్ని గృహాలకు తాగునీటి కనెక్షన్ ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పన్ను పరిధిలోకి రాకుండా అక్రమంగా వాడుతున్న కుళాయిలను గుర్తించి పన్నులు నమోదు చేయాలన్నారు. సచివాలయాల పరిధిలో అనధికార కుళాయి కనెక్షన్లను గుర్తించి వాటిని క్రమబద్ధీకరించడంలో అమెనిటీస్ కార్యదర్శులు బాధ్యత వహించాలని, వారిని నిరంతరం సంబంధిత అసిస్టెంట్ ఇంజనీర్లు పర్యవేక్షించాలని సూచించారు. సర్వేల ద్వారా గుర్తించిన అనధికార కనెక్షన్ల యజమానులకు నోటీసులు జారీ చేసి, వాటిని క్రమబద్ధీకరించి, పన్ను పరిధిలోకి తీసుకువచ్చి, పన్నుల వసూళ్ల ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు. సమావేశంలో ఇంజనీరింగ్, ఉద్యానశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ నరసింహారావు, డీఈఈలు ప్రసాద్, ముజాహిద్దీన్, శ్రీనివాస్‌రెడ్డి అసిస్టెంట్ ఇంజనీర్లు, వార్డు సచివాలయ కార్యదర్శులు, ఫిట్టర్లు పాల్గొన్నారు.

# ముందస్తు బెయిల్ కోసం ప్రసన్న ప్రయత్నం

### ఈనెల 8న హైకోర్టులో విచారణ



**నెల్లూరు లీగల్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు జిల్లా కోర్టులో మందస్తు బెయిల్ కోసం ప్రయత్నించి విఫలుడైన మాజీ మంత్రి కోవూరు మాజీ ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్న కుమార్ రెడ్డి హైకోర్టు గడప తొక్కారు. రాష్ట్ర ప్రభుత్వం తనను అకారణంగా అరెస్టు చేసి భయభ్రాంతులకు గురిచేసే ఉద్దేశంతో ఉందని పేర్కొంటూ ప్రసన్న కుమార్‌రెడ్డి హైకోర్టు ను ఆశ్రయించారు. తాజాగా మంగళ వారం విచారణ కు వచ్చిన పిటిషన్ ను న్యాయమూర్తి ఈనెల 8కి వాయిదా వేశారు. వివరాల్లోకి వెళితే ప్రసన్న కుమార్ రెడ్డి బొబ్బల శ్రీనివాస రావు తదితరులు గత జూలై 31 న మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి నెల్లూరు పర్యటన సందర్భంగా కావలి పోలీసు స్టేషన్ కు చెందిన కరణం మాలకొండయ్య అనే పోలీసు నిధులకు ఆటంకం కలిగించారని ఆయనను గుంపులో తోసివేసిన కారణంగా మాల కొండయ్య పైన అందరూ తొక్కి వేశారని దీంతో ఆయన మణికట్టు విరిగిందని మాలకొండయ్య పోలీసులకు ఫిర్యాదు చేశారు. నల్లపరెడ్డి పై కేసు నమోదు కావడంతో అజ్ఞాతం లోకి వెళ్లిన నల్లపరెడ్డి నెల్లూరు జిల్లా కోర్టులో ముందస్తు కోసం ప్రయత్నం చేశారు అయితే ఆ బెయిల్ పిటిషన్ను న్యాయమూర్తి ఆగస్టు 21న డిస్మిస్ చేశారు. దీంతో తనకు న్యాయం చేయాలని కోరుతూ నలపరెడ్డి హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్ పై రాష్ట్ర హైకోర్టు ఈనెల విచారణ చేయమంది నల్లపురెడ్డి పిటిషన్‌తోపాటు మరో నిందితుడు బొబ్బల శ్రీనివాసరావు ముందస్తు బెయిల్ పిటిషన్ కూడా అదే రోజు విచారణ జరగనుంది.

## పెల్లకూరు శ్రీనివాసులు రెడ్డి కలిసిన శివాజీ గౌడ్

**నెల్లూరు రూరల్, మేజర్‌న్యూస్ :** ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర కనీస వేతనల సలహా రాష్ట్ర బోర్డు చైర్మన్ పెళ్ళకూరు శ్రీనివాసులు రెడ్డిని నెల్లూరు రూరల్ మండలంలోని సౌత్ మోపూర్ గ్రామానికి చెందిన ఏపీఎస్ఆర్టీసీ బిఎంఎస్ కార్యదర్శి ఎంపులూరు శివాజీ గౌడ్ మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో బిఎంఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# డీఎస్సీ విజేతలకు 'ఆపస్' అభినందనసన్మానాలు




**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ప్రభుత్వం నిర్వ హించిన డిఎస్‌సి పరిక్షల్లో ప్రతిభ చూపి ఉపా ధ్యాయ ఉద్యోగాలకు ఎంపికైన విజేతలను ఆత్మ కూరులో ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం (ఆపస్) నాయకులు ఘనంగా సన్మానించి అభి నందించారు. గురువారం స్థానిక మేధా స్కూల్లో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో ముఖ్య అతిధిగా ఆపస్ జిల్లా ప్రధానకార్యదర్శి పట్నం అనీల్‌కుమార్ పాల్గొని ప్రసంగిస్తూ జాతీయ భావాలు కలిగి క్రమశిక్షణ కలిగిన ఉపాధ్యా యులచే వర్ధిల్లుతున్న ఆపస్ నూతనంగా ఉపా ధ్యాయ ఉద్యోగాలకు ఎంపికైనవారికి తోడుగా ఉంటుందన్నారు. విజేతలు సి.హెచ్.వెంకటరెడ్డి, డి.సురేష్‌బాబు, బి.హరికృష్ణ, కె.చంద్ర, ఎస్.పుష్ప, ఎన్.శ్రీనివాసులు, పి.స్రవంతి, పిసునీతలను వారు అభినందించి సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆపస్ జిల్లా బాధ్యులు రాఘ వరెడ్డి, వెంకటరమణారెడ్డి, రాఘవరెడ్డి, డివిజన్ కార్యదర్శి ఎం.పెంచలరెడ్డి, మండల అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు సి.హెచ్.ఉమామహేశ్వ రాచారి, కె.వెంకటేశ్వర్లు, నాయకులు కె.నర శింహారెడ్డి, ఎన్.మాధవరెడ్డి, ఎన్.వెంకయ్య, డి.సురేష్‌బాబు, కె.వెంకటేశ్వర్లు, శేషయ్య, వెంకురెడ్డి, తిరుమలరెడ్డి, పలువురు ఆపస్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ప్రారంభమైన గంధమహోత్సవం



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరు పట్టణంలోని శ్రీశ్రీశ్రీ హజరత్ సయ్యద్ అన్సర్‌షావలిబాబా గంధమహోత్సవం గురువారం ఘనంగా ప్రారంభమైంది. స్థానిక తూర్పువీధిలో వెలసియున్న అన్సర్‌షావలిబాబా గంధమహోత్సవాన్ని గురువారం తెల్లవారుఝామున ప్రారంభించగా 3రోజులపాటు నిర్వహించనున్నారు. తెల్లవారుఝామున దర్గా పూజారి హాఫీజ్‌ఖాదిరి దర్గా వద్ద సొథల్‌కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారి సమాధికి గంధాన్ని లేపనంగా పూసిన అనంతరం సమాధిపై వస్త్రాన్ని, పూలఛద్దర్‌ను అలంకరించి ప్రత్యేక ప్రార్ధనలు నిర్వహించారు. తొలిరోజు అన్నదాన కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున నిర్వహించారు. ఈకార్యక్రమంలో పెద్దఎత్తున భక్తులు పాల్గొన్నారు.

### జిల్లా ఉత్తమ ఉపాధ్యాయునిగా శ్రీనివాసరాజు



**వింజమూరు, మేజర్‌న్యూస్ :** మండలంలోని జిబికేఆర్ ఎస్టీ కాలనీలోని 2వ పాఠశాలలో ప్రభుత్వ ఉపాధ్యా యునిగా పనిచేస్తున్న ఓంకారం శ్రీనివాసరాజు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయునిగా ఎంపికైనట్లు ఆయన తెలి పారు. శుక్రవారం జిల్లా పాలనాధికారి కార్యాలయంలో జరిగే కార్య క్రమంలో ఈ ఉత్తమ అవార్డును అందుకోనున్నట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా పలువురు ఉపాధ్యాయులు మిత్ర బృందం అభినందించారు.

## రోడ్డు ప్రమాదంలో పాల వ్యాపారికి తీవ్ర గాయాలు

**ముత్తుకూరు, మేజర్‌న్యూస్ :** బ్రహ్మదేవి సెంటర్ వద్ద గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఈ గ్రామానికి చెందిన షేక్ అహ్మద్ అనే వ్యక్తి తీవ్రంగా గాయపడ్డారు. స్థానికుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. గాయ పడిన అహ్మద్ పాల వ్యాపారం చేసుకుని కుటుంబాన్ని పోషించుకుం టున్నారు. దినచర్యలో భాగంగా ద్విచక్ర వాహనంపై పాల క్యాన్లు పెట్టుకొని పాలు సేకరణకు లింగాయపాలెం గ్రామానికి వెళుతుండగా తాళ్లపూడి గ్రామానికి చెందిన కారు ఇటువైపు వస్తు బలంగా ఢీ కొట్టి గాయపరిచింది. ప్రమాదంలో బైక్ తుక్కుతుక్కు అయింది. అహ్మద్ తలకు బలమైన గాయం తగిలింది. అంబులెన్స్ ద్వారా నెల్లూరు నగరంలోని ప్రైవేట్ హాస్పిటల్ కు తీసుకువెళ్లారు. పరిస్థితి ప్రమాదకరంగా ఉందని తెలుస్తుంది.

## అంగన్వాడీ కేంద్రాలు సందర్శన : ఐసీడీఎస్ పీడీ



**నెల్లూరు రూరల్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు రూరల్ నియోజకవర్గం పరిధిలోని కొండాయపాలెం సెక్టార్ నందు గల ముత్యాలపాలెం-1 అండ్ 2, కర్ణాలమిట్ట అంగన్వాడీ కేంద్రాలను జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ, సాధికారిత అధికారిణి బి.హేనాసూజన్ సందర్శించి అక్కడ భోజనం, సరుకుల యొక్క నాణ్యత, పిల్లల బరువు ఎత్తులను పరిశీలించారు. అలాగే ఈసీసీ ఈ కార్యక్రమాలను సక్రమంగా నిర్వర్తించాలని, టి హెచ్ ఆర్, స్టాక్ రెజిస్టర్స్ అన్నీ అప్డేట్‌గా వుంచుకోవాలని సంబందిత అంగన్వాడి కార్యకర్తలకు తగు సూచనలను, సలహాలను ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో నెల్లూరు అర్బన్ ప్రాజెక్టు సీడీపీఓ టి.అరుణ తదితరులు పాల్గొన్నారు.

## గుర్తు తెలియని శవం ఆచూకీ తెలపండి



**వింజమూరు, మేజర్‌న్యూస్ :** మండలంలోని ఊటుకూరు పంచాయతీ పరిధిలోని తక్కెళ్ళపాడు గ్రామ చెరువులో గుర్తు తెలియని మహిళా శవం గుర్తించారు. వీఆర్వో సహాయంతో పోలీసులు సంఘటన స్థలాన్ని చేరు కొని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వీర ప్రతాప్ తెలిపారు. మహిళలకు 50నుండి 55 యేళ్ల వయసు ఉంటుం దని ఎవరికైనా ఆచూకీ తెలిసినట్లయితే ఎస్ఐ నంబర్ 9440796375కు ఫోన్ చేసి సమాచారాన్ని తెలుపగలరని ఆయన తెలిపారు.

## కలువాయిలో సర్వసభ్య సమావేశం




**కలువాయి, మేజర్‌న్యూస్ :** మండల నందు సాధారణ సర్వసభ్య సమావేశం గురువారం జరిగింది. ఈ సమావేశం వాడి వేడిగా జరిగింది. మండల తహసీల్దార్ గత ఒకటిన్నర సంవత్సరంగా ఎప్పుడు సాధారణ సర్వ సభ్య సమావేశం నిర్వహించిన హాజరు కావడంలేదంటూ జడ్పీటీసీ బులగాకుల అనిల్ కుమార్‌రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు..అగ్రికల్చర్ అధికారులుకు యూరియా సక్రమంగా పంపిణీ చేయాలని తగు సూచ నలు చేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎంపీడీఓ భవాని, మండల పరిషత్ అధ్యక్షులు లక్ష్మి దేవి, జడ్పీటీసీ బులగాకుల అనిల్ కుమార్ రెడ్డి, వైస్ ఎంపీపీ పంగా పెంచల నరసారెడ్డి, సర్పంచులు, సొసైటీ చైర్మన్ జగ దల్ నాయుడు, సోమశిల ప్రాజెక్టు దక్షిణ కాలువ 2 చైర్మన్ మల్లు విజయ కుమార్‌రెడ్డి, అధికారులు, ఎంపిటిసి సభ్యులు పాల్గొన్నారు.

## అక్రమ లేఔట్లను చట్టబద్ధం చేసుకునే అవకాశం

**ముత్తుకూరు, మేజర్‌న్యూస్ :** 2025 సంవత్సరం జూన్ 30వ తేదీ కంటే ముందు అక్రమ లే అవుట్లను ఎల్ఆర్ఎస్ స్కీం ద్వారా చట్టబద్ధం చేసుకునే అవకాశాన్ని రాష్ట్ర ప్రభుత్వం కల్పించిందని ఈ అవకాశాన్ని లేఅవుట్ యజమానులు చేసుకోవాలని మండల తాసిల్దార్ స్వప్న ప్రకటనలో తెలిపారు. గురువారం ఆమె వివరాలను మీడియాకు తెలియజేశారు. లేఅవుట్ రెగ్యుల రై జేషన్ స్కీం అమల్లో ఉందన్నారు. ఈ సంవత్సరం అక్టోబర్ 24 తేదీ లోపల యజమానులు భూమి హక్కు పత్రాలు అదేవిధంగా ప్లాన్ రికార్డులు రాష్ట్ర ప్రభుత్వానికి ఆన్లైన్ ద్వారా పంపి చేసుకోవాల్సిన అవసరం ఉందని తహసిల్దారు తెలిపారు.

# వీఎస్‌యూలో ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు




**వెంకటాచలం, మేజర్‌న్యూస్ :** కాకుటూరులోని విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం ప్రాంగణంలోని శ్రీ పొట్టి శ్రీరాములు భవనంలో బుధవారం ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వైస్ ఛాన్సలర్ ఆచార్య అల్లం శ్రీనివాసరావు ముఖ్యఅతిథిగా డీకే కళాశాల మాజీ ప్రిన్సిపాల్ డాక్టర్ సి.శారద విశిష్ట అతిథిగా, రిజిస్ట్రార్ డా. కె.సునీత గౌరవ అతిథిగా హాజరయ్యారు. వేడుకల ప్రారంభంలో భారత మాజీ రాష్ట్రపతి, విద్యావేత్త డా. సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వైస్ ఛాన్సలర్ మాట్లాడుతూ.. గురువు అనేది జ్ఞానం పంచడమే కాక సమాజ నిర్మాణానికి మార్గదర్శి. విద్యార్థుల్లో మానవీయ విలువలు, నైతికత, సామాజిక బాధ్యతలను పెంపొందించడం ఉపాధ్యాయుల నిజమైన ధర్మమని పేర్కొన్నారు. డా.సి.శారద మాట్లాడుతూ.. ఉపాధ్యాయులు సృజనాత్మక బోధనా పద్ధతులు అవలంబించి విద్యార్థుల సమగ్రాభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. రిజిస్ట్రార్ డా. కె.సునీత మాట్లాడుతూ.. విశ్వవిద్యాలయం చేపడుతున్న డిజిటల్ లెర్నింగ్ ప్రాజెక్టులు, అధ్యాపక శిక్షణా కార్యక్రమాలు భవిష్యత్ తరాలకు మార్గదర్శకమవుతాయని తెలిపారు. సందర్భంగా ఉపాధ్యాయుల క్రీడా పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. అధ్యాపకులు, విద్యార్థులు, సిబ్బంది ఉత్సాహంగా పాల్గొన్నారు.

# డీఆర్ ఛానల్‌లో.. అవినీతిని సీఎంకి తెలిపిన మాలేపాటి



**కావలి, మేజర్‌న్యూస్ :** కావలి నియోజకవర్గం దగదర్తి మండలంలో తెలుగుదేశం ప్రభుత్వంలో డిఎం, డిఆర్ ఛానల్ అభివృద్ధికి సుమారు 30 కోట్ల రూపాయలు నిధులను మంజూరు చేసి డిఆర్డిఎమ్ ఛానల్ల వలన రైతులకు ప్రయోజనకరంగా నిర్మించేందుకు ప్రణాళికన రూపొందించారు. అయితే ప్రస్తుతం ఆ కాంట్రాక్టర్ డిఆర్, డిఎం ఛానల్ నిర్మించడం నాసిరకంగా ఉందని, రైతులకి అన్యాయం జరుగుతుందని అక్కడ నిర్మిస్తున్న నిర్మాణాల్లో నాణ్యత లేకపోక ఆ నిర్మాణాలు రైతులకు పంట నష్టం కలిగే విధంగా ఉందని అలాగే 23 గ్రామాల ప్రజలు 23వేల మంది రైతులకు పూర్తిగా అన్యాయం జరుగుతుందని ఇక్కడ జరుగుతున్న అన్యాయాన్ని, రైతులకు జరగబోయే అన్యాయాన్ని ఆగ్రో ఇండస్ట్రీ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ వారి కార్యాలయంలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుని కలిసి పనుల్లో జరుగుతున్న అక్రమాలపై క్షుణ్ణంగా ముఖ్యమంత్రి దృష్టికి తీసుకు వెళ్లడం జరిగింది. అనంతరం స్థానుకూలంగా స్పందించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వెంటనే సమగ్ర విచారణ జరిపించి రైతులకు న్యాయం జరిగేలా తగు చర్యలు తీసుకుంటామని, ఆగ్రో ఇండస్ట్రీ చైర్మన్ మాలేపాటి సుబ్బరాయుడు కు హామీ ఇవ్వడం జరిగిందని, అలాగే ప్రస్తుతం జరుగుతున్న పనులపై కూడా ఆరా తీయడం జరిగిందని తెలిపారు.

# సౌత్ మోపూర్‌లో 133 మందికి కంటి అద్దాలు పంపిణీ



**నెల్లూరు రూరల్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు రూరల్ నియోజకవర్గ పరిధిలోని సౌత్ మోపూర్‌లో శంకర నేత్రాలయ కంటి వైద్యశాల, చెన్నై, కాటంరెడ్డి ప్రసాద్‌రెడ్డి, శోభారెడ్డి (యూఎస్ఏ)సౌజన్యంతో ఉచిత కంటి శుక్లం శస్త్ర చికిత్స శిబిరాన్ని నెల్లూరు రూరల్ నియోజకవర్గం ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి, రాష్ట్ర టిడిపి నాయకులు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి సూచనలతో నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో సౌత్‌మోపూర్‌లో జూన్ నెలలో 7రోజులపాటు ఉచితకంటి వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసి పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి కంటి ఆపరేషన్లు చేయడం జరిగింది. అదేవిధంగా కంటి ఆపరేషన్ చేయించుకున్న 133మందికి గురువారం సౌత్ మోపూర్ గ్రామంలోని వాణిశ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో 133మందికి అద్దాలు పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో చెన్నారెడ్డి సురేందర్ రెడ్డి, నెల్లూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ రాపూర్ చంద్రశేఖర్, గుండ్లపాలెం ప్రాథమిక వ్యవసాయ కో-ఆపరేటివ్ సొసైటీ చైర్మన్ పముజుల ప్రదీప్, గ్రామ టిడిపి అధ్యక్షుడు అన్నం సుధాకర్ గౌడ్, నాయకులు ఆరెద్దుల మణి తదితరులు పాల్గొన్నారు.

# అంగన్వాడి కార్యకర్తల పోస్టులకు 10న ఇంటర్వ్యూలు



**వింజమూరు, మేజర్‌న్యూస్ :** వింజమూరు ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలోని అంగన్వాడీ కార్యకర్తల, ఆయా పోస్టులకు గత నెలలో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఈనెల 10వ తేదీన కావలి ఆర్డిఓ కార్యాలయం నందు ఉదయం 9 గంటల నుండి ఇంటర్వ్యూ నిర్వహింపబడతాయని సిడిపిఓ పద్మజాకుమారి తెలిపారు. కథలో 5వ తేదీ నుండి 26వ తేదీ వరకు 11 కార్యకర్తలు 12 ఆయా పోస్టులకు దరఖాస్తు చేసుకున్న విషయం తెలిసిందే కాగా వారికి ఈనెల ఆరో తేదీ నుండి 8వ తేదీ వరకు కాల్ లెటర్స్ పంపబడతాయన్నారు. పదవ తేదీ ఉదయం 9గంటల నుండి ఇంటర్వ్యూలు ప్రారంభమవుతాయన్నారు. ఈ ఇంటర్వ్యూలు డివిజన్ల వారీగా జరుగుతాయని తెలిపారు 10వ తేదీ ఉదయం కావలి డివిజన్ పరిధిలోని వింజమూరు కలిగిరి జలదంకి మండలాలకు చెందిన అభ్యర్థులు ఇంటర్వ్యూకు హాజరు కావాల్సి ఉందన్నారు. ఇంటర్వ్యూకు హాజరయ్యే అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికేట్‌తోపాటు జిరాక్స్ సెట్ కూడా తీసుకు వెళ్లాల్సి ఉందన్నారు. కావున దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు తప్పనిసరిగా ఈ అవకాశాన్ని సద్వినియోగపరుచుకోవాలని ఆమె కోరారు.

# రేపు స్త్రీ శక్తి విజయోత్సవ ర్యాలీ కార్యక్రమం



**వింజమూరు, మేజర్‌న్యూస్ :** వింజమూరులో శనివారం మధ్యాహ్నం 3గంటలకు స్త్రీ శక్తి విజయోత్సవ ర్యాలీ కార్యక్రమం నిర్వహింపబడుతుందని తెలుగుదేశం పార్టీ కార్యాలయం ఓ ప్రకటనలో తెలియజేశారు. ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ఆధ్వర్యంలో స్థానిక బంగ్లా సెంటర్ నుండి ఎస్వి కన్వెన్షన్ హాల్ వరకు ఈ ర్యాలీ నిర్వహించబడుతుందని తెలిపారు. అనంతరం ఏర్పాటు ఈ సభలో ఎమ్మెల్యే ప్రసంగిస్తారని తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఎన్నికల హామీలు ఇచ్చిన సూపర్ సిక్స్‌లో భాగంగా మహిళల పాలిట వరంగా మారిన స్త్రీ శక్తి పథకాన్ని విజయవంతంగా అమలు చేస్తున్నందున ఈ విజయోత్సవ ర్యాలీని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి తెలుగుదేశం బిజెపి జనసేన నేతలు కార్యకర్తలు అభిమానులు అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయవలసిందిగా కోరారు.

# ట్రాన్స్‌ఫార్మర్ దిమ్మెపై స్పందించిన విద్యుత్ శాఖ



**కావలి, మేజర్‌న్యూస్ :** కావలి పట్టణంలో స్థానిక రంకు రోడ్డులో నమస్కార్ హెూటల్‌కి ఎదురుగా సత్య అనే భారీ షాపింగ్ మాల్‌ను ప్రారంభించారు. ఆ భవనానికి సరైన అనుమతులు, ఫైర్ అనుమతులు లేకపోయినప్పటికీ ఉన్నత అధికారులు మాత్రం చోద్యం చూస్తున్నారు. మున్సిపల్ స్థలంలో ఆ షాపింగ్ కాంప్లెక్స్‌కు ట్రాన్స్‌ఫార్మర్ నిర్మించుటకు పిల్లర్ దిమ్మను నిర్మించి ఉన్నారు. పిల్లర్ దిమ్మ రోడ్డుకి సత్య షాప్‌కి మధ్యలో ఉంది. ఈ షాపుకి పక్కనే 10 అడుగుల రోడ్డు మాత్రమే ఉంది. ఇక్కడికి నిత్యం లారీలతో లోడ్లు చేస్తూ అన్లోడ్ చేస్తుంటారు. ఇక్కడ రద్దీగా ప్రజలు ద్విచక్ర వాహనదారులు వ్యాపారస్తులు నిత్యం తిరుగుతుంటారు. ఈ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఇక్కడ నిర్మిస్తే ఇక్కడ జరగరానిది జరిగితే, ఈ ప్రమాదానికి బాధ్యత ఎవరు వహిస్తారు. ఈ విషయంపై నెల్లూరు విద్యుత్ శాఖ సీనియర్ ఇంజనీర్ విజయానంద్‌ని **'సూర్య ప్రతినిధి'** చరవాణిలో వివరణ కోరగా ఈ విషయంపై స్పందించి క్రింది అధికారులకు ఆదేశాలు జారీ చేస్తామని, ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

# 50శాతం బయో మైనింగ్ పని పూర్తి



**నెల్లూరు కార్పోరేషన్, మేజర్‌న్యూస్ :** నగరపాలక సంస్థ పరిధిలోని అల్లీపురం, దొంతాలి డంపింగ్ యార్డులలో గల వ్యర్థాలు (లెగసీ వేస్ట్ ) 3,24,479 టన్నులను మెసర్స్ జిగ్మ నోబెల్ గ్లోబల్ ఎన్విరాన్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ద్వారా బయోమైనింగ్ పద్ధతిలో ప్రాసెసింగ్ చేస్తున్నట్లు కమిషనర్ వై.ఓ నందన్ గురువారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ఇప్పటివరకు 1,68,430 టన్నుల వ్యర్థాలను అనగా 50శాతం బయోమైనింగ్ పని పూర్తి కాబడినదని తెలిపారు. అదేవిధంగా మిగిలిన మట్టిని లోతట్టు ప్రాంతం బోడి గాని తోట పార్కు స్థలము, ఎన్టీఆర్ నగర్ బరియల్ గ్రౌండ్, పినాకిని పార్క్ వద్ద ఖాళీ స్థలం, ఎన్టీఆర్ నగర్‌లో గల ఈఎల్ఎస్ ఆర్.పద్మావతి నగర్ గ్రీన్ సిటీ, భగత్ సింగ్ కాలనీ లేఅవుట్ సైట్ నందు వినియోగిస్తున్నామని కమిషనర్ తెలియజేశారు. దొంతాలి డంపింగ్ యార్డ్ లోని మట్టిని సర్వేపల్లి సమీపంలో ఉన్న పిగ్ షెల్టర్స్ స్థలంలో ఉన్న లోతట్టు ప్రాంతాలను లెవలింగ్ చేయడానికి వినియోగిస్తున్నారని తెలిపారు. బయో మైనింగ్ ప్రక్రియ ద్వారా వచ్చిన మట్టి వలన హానికర సమస్యలు తలెత్తవని, ఇది శాస్త్రీయబద్ధంగా జరుగుచున్న ప్రక్రియ అని కమిషనర్ స్పష్టం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఇదే విధానంలో బయోమైనింగ్ ప్రక్రియ జరుగుతుందని కమీషనర్ తెలియజేశారు.

# ప్రత్యేక అవసరాల పిల్లల బాధ్యత నేను తీసుకుంటా : ఎమ్మెల్యే కాకర్ల



**వింజమూరు, మేజర్‌న్యూస్ :** చిన్న వయసులో అంగవైకల్యం కలిగి ఉన్న విద్యార్థుల ప్రత్యేక అవసరాలు తాను బాధ్యతగా తీసుకొని వారి అవసరాలు తీరుస్తానని ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ పేర్కొన్నారు. వింజమూరు మండల కేంద్రంలోని బాలు రవన్నత పాఠశాల నందు సమగ్ర శిక్ష సహిత విద్యా విభాగము ఆధ్వర్యంలో ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు ఉచిత ఉపకరణ నిర్ధారణ శిబిర కార్యక్రమం గురువారం విద్యాశాఖ నిర్వహించింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ మాట్లాడుతూ.. ఉదయగిరి నియోజకవర్గంలో 8 మండలాల్లో ప్రత్యేక అవసరాలు అవసరమైన విద్యార్థుల భవితకు తాను తోడుంటానని వారిని విద్యావంతులను చేసే బాధ్యతను తీసుకుంటానని ఇందుకు ప్రభుత్వం తరపున అందాల్సిన సహాయ సహకారాలు అందే విధంగా కృషి చేస్తానని పేర్కొన్నారు. ఉదయగిరి నియోజకవర్గంలో 352 మందికి పైగా ప్రత్యేక అవసరాలు అవసరమైన విద్యార్థులు ఉన్నట్లు వారందరినీ ఈ వేదిక వద్దకు తీసుకురావడం వారికి నిర్ధారణ పరీక్షలు చేయించిన విద్యాశాఖ జాయింట్ డైరెక్టర్ ముువ్వా రామలింగంకి ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. ప్రతి మండల కేంద్రంలో విద్యా వనరుల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే భవిత కేంద్రానికి వచ్చే విద్యార్థులకు వారి అటెండర్ లకు ప్రభుత్వం ప్రతి ఏడాది ఆర్థిక సాయం పలు రకాలుగా అందించడం జరుగుతుందన్నారు. ప్రత్యేక అవసరాల విద్యార్థుల తల్లిదండ్రులు వారి విద్య పట్ల ప్రత్యేక శ్రద్ధ కనబరిచి వారిని విద్యావంతులను చేస్తే వారి జీవనాన్ని కొనసాగించేందుకు చదువు ఎంతగానో ఉపయోగపడుతుందని పిల్లలు తల్లిదండ్రులకు భారం కాకుండా ఉంటారన్నారు. కాబట్టి ప్రతి ప్రత్యేక అవసరమైన విద్యార్థి తల్లిదండ్రులు శ్రద్ధగా ప్రభుత్వం అందించే సౌకర్యాలతో వారిని విద్యావంతులు చేయాలని కోరారు. వీరికి తన వంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని భరోసా ఇస్తున్నాను అన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ప్రత్యేక అవసరాల విద్యార్థులకు ఇచ్చిన భరోసాతో వారి తల్లిదండ్రులు విద్యార్థులు ఎంతో ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా, మండల శాఖ అధికారులతో పాటుగా స్థానిక ప్రజాప్రతినిధులు జడ్పిటిసి సభ్యులు గణపం బాలకృష్ణారెడ్డి గువ్వల కృష్ణారెడ్డి మండల దేశం కన్వీనర్ గూడా నర్సారెడ్డి మాజీ సొసైటీ చైర్మన్ జూపల్లి రాజారావు జనసేన మండల అధ్యక్షులు బండారు సత్యనారాయణ మండల ఉపాధ్యక్షులు ఆనంగి రమణయ్యకూటమి నాయకులు విద్యార్థులు తల్లిదండ్రులు ప్రత్యేక అవసరాల విద్యార్థులు పాల్గొన్నారు.

### హౌసింగ్‌లో అక్రమాలు బయటపడకుండా

# సున్నా పేమెంట్‌తో కొత్త స్కాంకు తెర లేపారు



**నెల్లూరు కలెక్టరేట్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు జిల్లాలోనూ 0 పేమెంట్ల స్కాం మొదలుపెట్టారు. ప్రభుత్వాలను మోసం చేస్తున్నారని నెల్లూరు జిల్లా జాయింట్ కలెక్టర్ కార్తీక్‌కు బిజెపి నేత మిడతల రమేష్ వినతిపత్రం ఇచ్చారు. లబ్ధిదారులు చనిపోయారు వారసులు లేరని. ప్రభుత్వ ఉద్యోగస్తులు పేదల పేరుతో గృహ నిర్మాణాలు చేసుకున్నారని సొంత గృహాలలో పక్కా గృహాలు నిర్మించారని 70 కోట్లు చెల్లింపులు చేసిన 4702 గృహాలకు సున్నా పేమెంట్‌తో ఫైనల్ బిల్లు చూపించి పూర్తయిన గృహాలుగా ఆన్లైన్లో చూపుతున్నారు. రాష్ట్రంలో 1.07.523 గృహాలకు జీరో పేమెంట్ చేసేందుకు ఎంపిక చేశారు. ఈ గృహాలన్ని గోడల నిర్మాణం వరకు.. స్లాబ్ నిర్మాణం వరకు జరిగి ఉన్నాయి. ప్రభుత్వం నగదు మెటీరియల్ చెల్లించింది. ప్రభుత్వ ఉద్యోగుల గృహ నిర్మాణాలు స్టేజీల వారీగా అధికారుల పర్యవేక్షణలో నిర్మాణాలు చేశారు. పాత ఇళ్లకు పక్కా గృహాల స్కీమును స్టేజీలవారీగా అధికారులు దగ్గరుండి కట్టించారు. లబ్ధిదారులు చనిపోయారు. వారికి వారసులు లేనట్లుగా చూపడంపై లోతైన దర్యాప్తు జరపాలి. వందల కోట్ల రూపాయలు అనర్హులకు నగదు మెటీరియల్ చెల్లింపులు చేసిన అధికారులందరిపై సమగ్ర విచారణ జరపాలి. 18వేల కోట్ల రూపాయలు కేంద్ర నిధులులో దుర్వినియోగం జరుగుతుంటే రాష్ట్రంలో అధికారులు ఎవరు విచారించేందుకు సిద్ధంగా లేరు. గతంలో హౌసింగ్ అధికారులు చేసిన అక్రమాల నుండి బయట పడేందుకే 0 పేమెంట్‌లు చూపిస్తున్నారు. గృహాలు పూర్తయినట్లుగా ఆన్లైన్లో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు చూపించి మోసం చేసే కుట్ర జరుగుతుంది. 0 పేమెంట్లపై సమగ్ర విచారణ జరపాలని రమేష్ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పొట్లూరు శ్రీనివాసులు, రఘురామయ్య, నాగేంద్ర సింగ్, ఏవి సుబ్బయ్య, లక్ష్మణరావు, రాములు యాదవ్, నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

# ఆర్ఎస్ఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఉపాధ్యాయుల దినోత్సవం



**బోగోలు, మేజర్‌న్యూస్ :** బోగోలు మండలం కడనూతల రామిరెడ్డి సుబ్బరామిరెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జన్మదినంను పురస్కరించుకొని ఉపాధ్యాయుల దినోత్సవంను ఘనంగా నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పివిఎన్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈ కార్యక్రమం ఈఈఈ డిపార్ట్మెంట్, ఎన్ఎస్ఎస్ వాలంటీర్ల ఆధ్వర్యంలో నిర్వహించినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల హెచ్ అండ్ ఎస్, హెచ్ఓడి అయిన డాక్టర్ కె.లక్ష్మి అలాగే కాలేజీ వెలుపల నుంచి గుడ్లూరు మండలం, ఆవుల వారి పాలెం గ్రామంలోని ఎంపీపీ స్కూల్లో సీనియర్ అధ్యాపకులుగా పనిచేస్తున్న శ్రీ షేక్ మీరావలి గార్లను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సన్మాన గ్రహీతలు మాట్లాడుతూ.. గురుపూజోత్సవ ప్రధాన ఉద్దేశం, గురువులకు శిష్యులకు గల సంబంధాలు గూర్చి విద్యార్థిని విద్యార్థులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ కే రాజారెడ్డి గారు ఏవో ఆర్వి రమణారెడ్డి అన్ని విభాగాలు అధిపతులు, అధ్యాపకులు అధ్యాపకేతర సిబ్బంది తోపాటు ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త ఏ.కిరణ్ కుమార్ ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## షాపులకు బకాయిలు ఉంటే ఉపేక్షించను : కమిషనర్



**నెల్లూరు కార్పోరేషన్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు నగరపాలక సంస్థ కమిషనర్ వై.ఓ నందన్ స్థానిక మద్రాస్ బస్టాండ్ ప్రకాశం పంతులు మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్, చేపల మార్కెట్ సమీపంలోని షాపింగ్ కాంప్లెక్స్, జలపుష్ప భవన్, సౌదాగర్ షాపింగ్ కాంప్లెక్స్ లలోని అద్దె షాపులను గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అద్దె షాపులను వేలం దారులు నిర్వహిస్తున్నారా లేక సబ్ లీజుకు ఇచ్చి నిర్వహిస్తున్నారా అని షాపుల నిర్వాహకులను వాకబు చేశారు. షాపుల అద్దె బకాయిలు క్రమం తప్పకుండా నగర పాలక సంస్థకు చెల్లించాలని, బకాయిలు ఉంటే ఉపేక్షించబోమని షాపు నిర్వాహకులకు కమిషనర్ సూచించారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు నగరపాలక సంస్థ రెవెన్యూ ఆఫీసర్ సమ్మద్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ కిరణ్, కార్తిక్ రెడ్డి, శానిటేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

## కాలువ నిర్మాణం పనులు పరిశీలన కమిషనర్



**నెల్లూరు కార్పోరేషన్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు నగరపాలక సంస్థ కమిషనర్ వై.ఓ నందన్ పారిశుధ్య నిర్వహణ పనుల పర్యవేక్షణలో భాగంగా గురువారం స్థానిక వాకర్స్ రోడ్డు పుట్టా ఎస్టేట్ ప్రాంతంలో నూతనంగా జరుగుతున్న డ్రైను కాలువ నిర్మాణం పనులను పర్యవేక్షించారు. నిర్మాణ పనులను నిర్దేశించిన సమయంలోపు ప్రణాళికాబద్ధంగా పూర్తి చేయాలని ఇంజినీరింగ్ విభాగం అధికారులను కమిషనర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జోనల్ ఆఫీసర్ ప్రవీణ్, శానిటరీ సూపర్వైజర్ షరీఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

## మాలేపాటిని కలిసిన ఎమ్మెల్యే, నేతలు



**కావలి, మేజర్‌న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆగ్రో చైర్మన్ మాలేపాటి సుబ్బానాయుడును గురువారం నరసరావుపేట మాలేపాటి కార్యాలయంలో ఉండగా విషయం తెలుసుకున్న నరసరావుపేట ఎమ్మెల్యే చదలవాడ అరవింద్ బాబు, రాష్ట్ర తెలుగు అకాడమీ చైర్మన్ ఆర్డీ విల్సన్ నరసరావుపేటలోని చైర్మన్ కార్యాలయంలో వారు మర్యాదపూర్వకంగా కలవడం జరిగింది. అనంతరం రాష్ట్రంలో ఎన్డీఏ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలను సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి ప్రభుత్వానికి మంచి పేరు తెచ్చేందుకు కొద్ది నిమిషాలు చర్చించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆగ్రో కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

## కొత్తపల్లి ఆధ్వర్యంలో సేవా కార్యక్రమం

**ముత్తుకూరు, మేజర్‌న్యూస్ :** జిల్లా బ్రాహ్మణ సంఘం నాయకులు, తిరుపతి పార్లమెంట్ నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ గౌరవాధ్యక్షులు కొత్తపల్లి రమేష్ కుమార్ శర్మ ఆధ్వర్యంలో గురువారం బ్రహ్మ దేవి గ్రామం నందు సేవా కార్యక్రమాల్లో భాగంగా అన్నదానం కార్యక్రమం జరిగింది. ఆయనతోపాటు కుటుంబ సభ్యులు ఉభయ దాతలుగా వ్యవహరించారు. గ్రామంలో జరుగుతున్న వినాయక చవితి మహోత్సవాల్లో ఉత్సవ కమిటీ సభ్యుల విజ్ఞప్తి మేరకు రైస్ మిల్లు సెంటర్, గమళ్ళ పాలెం సెంటర్లు వద్ద గణపతి సన్నిధిలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# బోదనలో మేటి... క్రమశిక్షణలో ఘనాపాటి..

## ఉత్తమ ఉపాధ్యాయిని మణి

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** బోధనలో మేటిగా, క్రమశిక్షణలో ఘనాపాటిగా పేరుగాంచిన ఆత్మకూరు మండలం కరటంపాడు జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాల జీవశాస్త్ర ఉపాధ్యాయిని మండల స్థాయి ఉత్తమ ఉపాధ్యాయినిగా ఎంపికయ్యారు. శుక్రవారం ఆత్మకూరు మండల పరిషత్ కార్యాలయంలో అధికారులు నిర్వహించనున్న ఉపాధ్యాయ దినోత్సవం (గురుపూజోత్సవం) సందర్భంగా మణి ఈ గౌరవ పురస్కారాన్ని అందుకోనున్నారు. ఆత్మకూరుకు చెందిన మణి ఎంఎస్‌సి, ఎంఈడి కోర్సు చేసి గతంలో ఆత్మకూరు బాలికోన్నత పాఠశాల, చిలకలమర్రి, నందవరం ఉన్నత పాఠశాలల్లో సైన్ ఉపాధ్యాయినిగా పనిచేసి నేడు కరటంపాడు హైస్కూల్లో స్కూల్ అసిస్టెంట్‌గా కొనసాగుతుంది. ఆమె ఉపాధ్యాయ వృత్తిలో ప్రవేశించినప్పటినుండి నీతి, నిజాయితీ, నిబద్ధత కలిగి విధుల పట్ల అత్యంత చిత్తశుద్ధి, అంకితభావం కలిగి విధులు నిర్వహిస్తుండేది. ఖచ్చితంగా సమయపాలన పాటిస్తుండేది. నియమనిబంధనలకు అనుగుణంగా తుచ తప్పక వ్యవహరిస్తుండేది. ఆమె విధుల నిర్వహణలో అత్యంత అంకితభావం కలిగి విద్యార్థులకు నాణ్యమైన బోధన అందిస్తూ వారికి క్రమశిక్షణ అలవరుస్తూ ఎందరెందరినో ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దారు. సామాజికస్పృహ కలిగిన మణి తమ సాటి ఉపాధ్యాయులతో, కుటుంబసభ్యులతో పలు సేవాకార్యక్రమాలు కూడా నిర్వమిస్తుండేది. ఆమె గతంలో ఎల్ఆర్‌పల్లి ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయినిగా పనిచేసిన రోజుల్లో విధులను అత్యంత సమర్ధవంతంగా నిర్వహించడంతోపాటు అన్ని ప్రధాన కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించారు. సమీప గిరిజనకాలనీకి చెందిన చిన్నారులను బడికి రప్పించేలా అనేక ప్రోత్సాహకాలను కూడా అందజేసి రప్పించగలిగారు. ఉన్నత పాఠశాలల్లో తమ పాఠ్యాంశంను విద్యార్థులకు అత్యంత శ్రద్ధతో, అంకిభావంతో బోధనగావించారు. విధుల నిర్వహణపట్ల ఏనాడు నిర్లక్ష్యం చేయకుండా కొనసాగి విద్యార్థుల అభి



మానాన్ని, వారి తల్లిదండ్రుల ప్రశంశలు పొందారు. పరిక్షల నిర్వహణపట్ల ఉన్నతాధికారుల మన్ననలు కూడా పొందారు. ఆమె మండల స్థాయి ఉత్తమ ఉపాధ్యాయినిగా ఎంపికయ్యారన్న సమాచారంతో పలువురు ఉపాధ్యాయులు, ఉపాధ్యాయసంఘాల నాయకులు, ఏపికాట్వా నాయకులు, బంధుమిత్రలు, వివిధ ప్రజాసంఘాల ప్రతినిధులు ఆమెను అభినందనలతో ముంచెత్తి ప్రశంశల వర్షం కురిపించారు.

# విధుల్లో అంకితభావం.. నాయకత్వంలో పటిమాసామర్థ్యం



- ఉన్నత విద్యావంతుడు, సాంకేతికపరిజ్ఞానపరుడు
- అనిల్ ఉత్తమ ఉపాధ్యాయుడు

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** విధుల నిర్వహణలో అత్యంత అంకితబావం, నాయకత్వంలో అత్యంత పటిమాసామర్థ్యం కలిగిన ఆత్మకూరు మండలం కనుపూరుపల్లి పాఠశాల ప్రధాపాధ్యాయుడు పట్నం అనీల్‌కుమార్ మండల స్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడుగా ఎంపికయ్యారు. పిజి ఉన్నతవిద్య కలిగిన అనీల్‌కుమార్ ఆపస్ జిల్లా ప్రధానకార్యదర్శిగా కొనసాగుతున్నారు. ఆయన విధుల నిర్వహణలో ఏమాత్రం అలసత్వంలేకుండా అంకితభావంతో నిర్వహిస్తుంటారు. అలాగే యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా అత్యంత పటిమతో కార్యక్రమాలు, పోరాటాలు సాగిస్తుంటారు. ఆయనకు సాంకేతికపరిజ్ఞనం మెండుగా ఉండడంతో యూనియన్‌పరంగా కానీ, సాధారణంగా కానీ ఉపాధ్యాయులకు అవసరమైన సమాచారం ఇవ్వడం, వారికి అవసరమైన సేవలందించడం సాగిస్తుంటారు. ప్రజ్ఞాశాలిగా పేరుగాంచారు. విద్యార్థులకు నాణ్యమైన బోధన, ఉత్తమ క్రమశిక్షణ అందిస్తుంటారు. అనీల్‌కుమార్ మండల స్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడుగా ఎంపికకాగా శుక్రవారం జరుగనున్న ప్రత్యేక కార్యక్రమంలో ఈ గౌరవపురస్కారం అందుకోనున్నారు. ఆయన ఎంపిక సమాచారంతో ఉపాధ్యాయులు, ఆపస్, ఇతర ఉపాధ్యాయ సంఘాల నాయకులు, వివిధ ప్రజాసంఘాల ప్రతినిధులు అభినందనలు తెలిపారు.

# కసుమూరులో త్వరలో నిత్యాన్నదానం, మహిళలకు ప్రత్యేక స్కిల్ సెంటర్

**వెంకటాచలం, మేజర్‌న్యూస్ :** వెంకటాచలం మండలం కసుమూరులోని శ్రీ మస్తానయ్య దర్గాను సర్వేపల్లి శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, ఏపీ వక్ఫ్ బోర్డు చైర్మన్ షేక్ అబ్దుల్ అజీజ్ గురువారం సందర్శించారు. ప్రత్యేక ప్రార్థనలు చేసిన అనంతరం దర్గా ప్రాంగణాన్ని పరిశీలించి భక్తులకు కల్పించాల్సిన సౌకర్యాలపై ఆరా తీశారు. వక్ఫ్ బోర్డు చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన తర్వాత తొలిసారిగా కసుమూరుకు వచ్చిన అబ్దుల్ అజీజ్‌కు టీడీపీ నేతలు, ముస్లిం సోదరులు ఆత్మీయ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా సోమిరెడ్డి మాట్లాడుతూ.. కసుమూరులోని మస్తానయ్య దర్గా మతసామరస్యానికి ప్రతీకగా నిలుస్తోందని, దేశ నలుమూలల నుంచి భక్తులు తరలివస్తున్నారని తెలిపారు. భక్తుల సౌకర్యార్థం గదుల నిర్మాణం, కళ్యాణ మండప పునర్నిర్మాణం, ఉచిత మరుగుదొడ్ల ఏర్పాటు చేపట్టడంతో పాటు మహిళలకు ప్రత్యేకంగా స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. త్వరలోనే నిత్యాన్నదానం కూడా ప్రారంభిస్తామని తెలిపారు. వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్ మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా 26 స్కిల్ డెవలప్మెంట్ సెంటర్లు ఏర్పాటు చేయనున్నామని, అందులో ఒకటి కసుమూరులో ఉండబోతుందని చెప్పారు. ఏఐ, కంప్యూటర్, టాలీ వంటి డిజిటల్ నైపుణ్యాలతో పాటు సంప్రదాయ స్కిల్స్‌లోనూ మహిళలకు శిక్షణ ఇవ్వనున్నామని తెలిపారు. రాష్ట్రంలోనే తొలిసారిగా 100 మంది మహిళల కోసం కసుమూరులో సెంటర్ ఏర్పాటు చేయడం ఆనందకరమని పేర్కొన్నారు. అదనంగా, ఏఎస్‌పేట దర్గా, నెల్లూరు బారాషహీద్ దర్గాలో సౌకర్యాలు కల్పించడమే కాకుండా నెల్లూరులో నాలుగు స్కిల్ డెవలప్మెంట్ సెంటర్లు ఏర్పాటు చేయనున్నట్లు అబ్దుల్ అజీజ్ తెలిపారు.

# రేపటి నుంచి కోడూరు వేళాంగణి మాత జన్మదిన మహోత్సవాలు

**నెల్లూరు కలెక్టరేట్, మేజర్‌న్యూస్ :** తోటపల్లి గూడూరు మండలంలోని కొత్తకోడూరు కోడూరు వేలాంగణి మాత జన్మదిన మహోత్సవాలు ఈనెల 6, 7, 8న అంగరంగ వైభవంగా జరుగుతాయని ఆర్ సి ఎం చర్చ్ బిషప్ ఎండీ ప్రకాశం, వేళాంగణి మాత ఆలయ డైరెక్టర్ లూకాస్ రాజ్ పేర్కొన్నారు. నెల్లూరు నగరంలోని స్థానిక సంతపేట ప్రాంతంలో ఉన్న ఆర్సీఎం చర్చి ప్రాంగణంలో గురువారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సర్వ మానవాళికి మాత అయిన మరియమాత జన్మదిన వేడుకలు ఈనెల 8న శనివారం ఘనంగా



నిర్వహిస్తున్నామని ఈ కార్యక్రమంలో వేలాది మంది పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ సందర్భంగా ఉత్సవాల పండగ యొక్క ప్రాముఖ్యతను వివరించారు. అనంతరం మహోత్సవ వేడుకలలో పాల్గొననున్న భక్తులకు ఎటువంటి ఇబ్బందులు ఏర్పడకుండా తగిన మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామన్నారు. ఇప్పటికే ఆర్టీసీ ఆర్ఎంతో కూడా మాట్లాడామని ప్రత్యేక బస్సులను కూడా భక్తుల కోసం ఏర్పాటు చేస్తున్నారన్నారు. అనంతరం గోడ పత్రికలను ఆవిష్కరించారు. ఈ మీడియా సమావేశంలో ఫాదర్ లు పాపారావు షడ్రక్, ప్రమోద్, అలెక్స్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# వృత్తిపట్ల గౌరవం కలిగిన నాగరాజారావు

- ఉత్తమ ఉపాధ్యాయుడుగా ఎంపిక

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరు మున్సిపల్ పరిధిలోని పేరారెడ్డిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల స్కూల్ అసిస్టెంట్ పార్లపల్లి నాగరాజారావు మండల ఉత్తమ ఉపాధ్యాయుడుగా ఎంపికయ్యారు. శుక్రవారం జరుగనున్న గురుపూజోత్సవం సందర్భంగా ఆయన ఈ పురస్కారాన్ని అందుకోనున్నారు. నాగరాజారావు ఉపాధ్యాయ వృత్తిలో ప్రవేవించినప్పటినుండి వృత్తిపట్ల అత్యంత గౌరవబావం కలిగి ఉంటూ తనవంతుగా చిత్తశుద్ధిగా విధులు నిర్వహిస్తూ విద్యార్థులకు బోధనగావిస్తుంటారు. ఆయన పనిచేసిన అన్ని గ్రామాల్లో ప్రజాదరణ పొంది ప్రశంశలందుకున్నారు. ఆయనకు వైద్యం పట్ల అవగాహన కలిగిఉన్నందున ఆయా గ్రామాల్లో ప్రజలకు వైద్య సలహాలు, సేవలు అందిస్తుండేవారు. విద్యార్థులను క్రమశిక్షణతో తీర్చిదిద్దుతూ వారి తల్లిదండ్రుల మన్ననలు పొందారు. నాగరాజారావు మండల ఉత్తమ ఉపాధ్యాయుడుగా ఎంపికైన సమాచారంతో పలువురు ఉపాధ్యాయులు, ఉపాధ్యాయసంఘాల నాయకులు, కాట్వా నాయకులు, వివిధ ప్రజాసంఘాల ప్రతినిధులు ఆయనను అభినందించి ప్రశంశలఝుల్లులు కురిపించారు.



# ఆత్మకూరులో గురుపూజోత్సవం నేడే : ఎంఈఓ

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరులోని మండలపరిషత్ కార్యాలయం ఆవరణలో శుక్రవారం ఉపాధ్యాయదినోత్సవం (గురుపూజోత్సవం)ను నిర్వహించనున్నామని మండల విద్యాశాఖాధికారిణి అనంతలక్ష్మి పేర్కొన్నారు. మండలంలో 10మంది ఎస్‌జిటి ఉపాధ్యాయులను, ఐదుమంది స్కూల్ అసిస్టెంట్‌లను ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికచేశామని, వారిని సన్మానిస్తామని ఆమె తెలిపారు. మండలంలోని ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయలుందరూ ఈ కార్యక్రమానికి హాజరుకావాలని అనంతలక్ష్మి కోరారు. ఉత్తమ ఉపాధ్యాయులుగా పి.మణి(కరటంపాడుహైస్కూల్ ఎస్ఏ), డి.నరశింహారావు (మహిమలూరు హైస్కూల్ ఎస్ఏ), కె.రాజశేఖర్‌రెడ్డి(ఆత్మకూరు ప్రభుత్వ ఉన్నతపాఠశాల), పి.నాగరాజారావు (పేరారెడ్డిపల్లిహైస్కూల్), ఎండి మొహ్మద్(ఎస్ఏ), బి.సుధాకర్(బి.చిరువెళ్ళ), షేక్ జావీద్‌మహది (మహిమలూరు), పి.కొండారెడ్డి(కరటంపాడు), పి.అనీల్ (కనుపూరుపల్లి), ఎం.గంగాధరం (ఆత్మకూరు వెస్ట్), ఎస్.రామకృష్ణారెడ్డి (నరసాపురం.), ఎస్.సుభాషణమ్మ (ఎల్ఆర్‌పల్లి), కె.రేవతి (మహిమలూరు), పి.ప్రమీల (వెంకట్రావుపల్లి), జి.నాగేశ్వరరావు (అప్పారావుపాళెం.)లను ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికచేశామని అనంతలక్ష్మి పేర్కొన్నారు.



# ఇండియన్ సిల్క్ ఎక్స్ పో ప్రారంభం

**నెల్లూరు కలెక్టరేట్, మేజర్‌న్యూస్ :** దేశాలోని వివిధ ప్రాంతాల నుండి అన్ని వెరైటీల చీరలు, డ్రెస్ మెటీరియల్స్ తదితర అధునాతన వస్త్రాలను అందుబాటులోకి తీసుకువచ్చిన ఇండియన్ సిల్క్ గ్యాలరీ ఎక్స్ పో ను సింహపురి వస్త్ర ప్రియులు సందర్శించి ఆదరించాలని ఎక్స్ పో నిర్వాహకులు శ్రీనివాసులు పిలుపునిచ్చారు. నెల్లూరు నగరంలోని స్థానిక మినీ బైపాస్ రోడ్డు ప్రాంతంలో ఉన్న జిపిఆర్ కళ్యాణ మండపంలో గురువారం ఎక్స్పోను నూతనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా నెల్లూరు గ్రామీణ నియోజకవర్గం శాసనసభ్యులు సతీమణి సుజితమ్మ నగర ప్రముఖ మహిళలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎక్స్పో నిర్వాహకులు శ్రీనివాసులు మాట్లాడుతూ బెనారస్, పోచంపల్లి, కలంకారి, గద్వాల్, కాంచీపురం, ఉప్పాడ, వెంకటగిరి తదితర ప్రముఖ ప్రాంతాల నుండి హస్తకళ నిపుణులు తమ హస్తకళ నైపుణ్యత నేసిన చీరలు, డ్రెస్ మెటీరియల్స్, దుప్పట్లు, టవల్స్ మరియు అధునాతన వస్త్రాలను సింహపురి ప్రజలకు అందుబాటులోకి తీసుకు రావడం జరిగిందని ఈ అవకాశాన్ని సింహపురి ప్రజలు సద్వినియోగం చేసుకోవలసిందిగా కోరారు. ఎనిమిది వరకు ఎక్స్పో అందుబాటులో ఉంటుందని,ప్రతి కొనుగోలుపై 20 శాతం రాయితీ ఉంటుందని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాల్సిందిగా కోరారు.



## విద్యార్థులు క్రమశిక్షణతో రాణించాలి : ఎంపీడీఓ

**పెద్దపంజాణి, మేజర్‌న్యూస్:** విద్యార్థులు క్రమశిక్షణతో విద్యలో రాణించాలని పెద్దపంజాణి ఎంపీడీవో బాలాజీ పేర్కొన్నారు.రాయలపేట సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహాన్ని ఎంపీడీవో బాలాజీ గురువారం ఉదయం ఆకస్మికంగా తనిఖీ చేశారు. వంటగదిని, వంట తయారీ విధానాన్ని పరిశీలించారు. తప్పనిసరిగా ప్రతిరోజు కూరగాయలు, వంట పాత్రలు వంట పదార్థాలు శుభ్రం చేయాలని వంటవారు కూడా శుభ్రత పాటించాలన్నారు.హాస్టల్లో పరిశుభ్రత తప్పనిసరిగా పాటించాలి సూచించారు. 17 మంది విద్యార్థినులు అల్పాహార సమయానికి హాస్టల్లో హాజరై ఉన్నట్లు గమనించారు.హాస్టల్ లో వసతుల గురించి విద్యా బోధన గురించి భోజన నాణ్యత గురించి విద్యార్థినులను అడిగి తెలుసుకున్నారు. క్రమశిక్షణతో మంచి వ్యక్తిత్వంతో ధ్యానం, యోగ, వ్యాయామ పద్ధతులు పాటిస్తూ, విద్యార్థులు విద్యలో, క్రీడల్లో రాణించాలని ఆయన అన్నారు.వార్డెన్ కుసుమకుమారి సెలవులో ఉన్నందువలన చౌడేపల్లి హాస్టల్ వార్డెన్ దీపకుమారి ఇన్చార్జిగా ఉండటంతో ఆమెతో ఫోన్లో మాట్లాడి ఎలాంటి లోటుపాట్లు లేకుండా సక్రమంగా హాస్టల్ నిర్వహణ చేయాలని, విద్యార్థులకు అవసరమైన అన్ని సౌకర్యాలను ఏర్పాటు చేయాలని ఎంపీడీవో సూచించారు.ఈ కార్యక్రమంలో రాయలపేట పంచాయతీ కార్యదర్శి రెడ్డి శేఖర్, మహిళా సంరక్షణా కార్యదర్శి సమీరా పాల్గొన్నారు.



## ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం



**యాదమరి, మేజర్‌న్యూస్:** మండలంలోని ప్రభుత్వ బడులలో అంకిత భావంతో ,నిస్వార్ధంగా పని చేసే కొంత మంది గూరించి ఉపాధ్యాయ దినోత్సవ సందర్భంగా గుర్తు తెచ్చుకుందాం. యాదమరి మండలంలో టీచర్ కె .కనకాచారి 22 సంవత్సరాలుగా మండలంలో పనిచేస్తూన్నారు. ఆయన పనిచేసిన గ్రామాలైన డి.కె.చెరువు, దళవాయిపల్లె, పెరుమాళ్ళపల్లె, ప్రస్తుత్తం పనిచేస్తున్న కాశిరాళ్ళలో అభిమాన శిష్య బృందం వందల మంది ఉన్నారు. గత పది సంవత్సరాలుగా మహిళ టీచర్స్ డే ను తన సొంత ఖర్చుల తో ఘనంగా నిర్వహిస్తున్నాడు. ఆయన ఉమ్మడిజిల్లాలో సంకల్పం అవార్డు,, జిల్లా స్ధాయిలో2019లో ఉత్తమ టీచర్ అవార్డు కూడ తీసుకున్నాడు. రెండుసార్లు యు.పి స్థాయిలో రాష్ట్ర స్దాయి సైన్స్ విజ్ఞాన మేళా విద్యార్దులు తీసుకెళ్ళాడు. విద్యార్దుల మనస్సులో చిన్న తనం నుంచే మా అభిమాన గురువు అని ముద్ర వేసుకొని ఉంటారు ఆయన. ఈయన పి.ఆర్.టి.యు రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ ఉన్నాకూడ ఏ రోజున కూడ నాయకుడు అనే భావం లేకుండా నవ్వుతూ అందరిని నవ్విస్తూ, కలుపు నీ నీగోరు తనంగా ఉండే సున్నితమైన మనస్సు తత్వం కలిగిన వాడు. ఆయనకు ఇప్పుడు ప్రత్యేక అభినందన వందనాలు తెలియజేయాల నీ సాటి టీచర్లు, విద్యార్థులు విద్యార్థినీలు తెలిపారు.

## మంచి సమాజ నిర్మాణంలో గురువు పాత్ర విశిష్టమైనది

**కార్వేటినగరం మేజర్‌న్యూస్:** ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ విభాగము ఆధ్వర్యంలో గురువారం ముందస్తు ఉపాధ్యాయ దినోత్సవం పురస్కరించుకొని గురువందనం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ విజయులు రెడ్డి మాట్లాడుతూ డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ పుట్టినరోజున ఉపాధ్యాయ దినోత్సవం జరుపుకోవడం వెనుక గల కారణాన్ని వివరిస్తూ విద్యార్థి వ్యక్తిత్వ వికాసానికి విద్య మూలహేతువు అయితే విద్యార్థి అభ్యున్నతిని ఆకాంక్షించే దివ్య చైతన్య మూర్తి గురువు అని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి పూజను చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ యూనిట్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ ధనంజయ రెడ్డి, అధ్యాపకులు సీ ఎన్ లతా, సుబ్బారావు, హరిబాబు, బాబు, భార్గవి తదితర అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



## అభినందన సభను జయప్రదం చేయండి

**సూళ్లూరుపేట మేజర్, మేజర్‌న్యూస్:** సూళ్లూరుపేట వ్యవ శాయ మార్కెట్ కమిటి చైర్మన్ గా రాజకీయ చాణిక్యుడు, అందరివాడు సూళ్లూరుపేట పట్టణ తెలుగు దేశం పార్టీ అధ్యక్షుడు ఆకు తోట రమేష్ గురువారం కమిటి సభ్యులు లతో కలిసి ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగు దేశం పార్టీ కార్యకర్తగా గుర్తించి ఈ రోజు నాకు సూళ్లూరు పేట మార్కెటింగ్ చైర్మెన్ గా అవకాశం కల్పించిన ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ ఎన్ విజయశ్రీ, సూళ్లూరుపేట నియోజక వర్గం తెలుగు దేశం పార్టీ ఇన్చార్జ్ నెలవల సుబ్రమణ్యం, ప్రముఖ పారిశ్రామిక వేత్త కొండే పాటి గంగా ప్రసాద్ లకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఇందులో భాగంగా ఈ 7 వ తేదీ సూళ్లూరు పేట పట్టణ ప్రాంతలోని యస్. కె. యస్. కళ్యాణ మండపంలో అభినందన సభ నిర్వహించ నున్నట్లు తెలిపారు. ఈ సభకు ఇన్చార్జ్ మంత్రి అనగాన సత్య ప్రసాద్, ఎమ్మెల్యే విజయశ్రీ, రానున్నట్లు తెలిపారు. ఈ యొక్క అభినందన సభకు తెలుగు దేశం పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానులు, పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఇందలో బాగంగా నియోజక వర్గంలోని దొరవారి సత్రం మండలంలో మార్కెట్ యార్డ్ కు ఉన్న సమస్యలకు చెక్ పెట్టి దానిని కూడ అందు బాటులోకి తీసుకు రావడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్య క్రమంలో మార్కెట్ యార్డ్ సభ్యులు, నాయకులు, కార్యకర్తలు. పాల్గోన్నారు.



## చిరుత దాడిలో ఆవు మృతి

**చౌడేపల్లి రూరల్ మేజర్‌న్యూస్:** మండలంలో ని పరికిదొన గ్రామ పంచాయతీ సామిరెడ్డిపల్లి అటవీప్రాంతంలో చిరుత పులి సంచరిస్తున్నట్లు, నెల రోజుల క్రితం గంగాధర్ పాడి ఆవును చంపినట్లు గతంలోనే అనేక సార్లు అటవీ శాఖ అధికారులకు పిర్యాదు చేసినా సరిగా పట్టించుకోలేదని, గ్రామస్తులు వాపోయారు. ఈ క్రమంలో బుదవారం మద్యాహ్నం రైతు హరినాథ్ కు చెందిన పాడి ఆవులను పొలం వద్ద మేతకోసం తోలుకొని పోగా అందులో ఒకదానిపై చిరుత పులి దాడి చేసి హతమార్చినదని రైతు వాపోయాడు.గత సంవత్సర కాలంలో చిరుత దాడిలో నాలుగు పాడి ఆవులు మృతి చెందాయని.తక్షణమే అధికారులు చర్యలు చేపట్టి, రైతులకు నష్ట పరిహారం చెల్లించాలని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

# భారతానికి మార్గనిర్దేశకులు గురువులే

### - ఎస్వీయూలో ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం

**తిరుపతి ఎడ్యుకేషన్, మేజర్ న్యూస్:** నేటి భావిభారత మార్గనిర్దేశకులు గురువలేనని ఎస్వీయూ వీసీ సీహెచ్ అప్పారావు తెలిపారు ఎస్వీయూ శ్రీనివాస ఆడిటోరియంలో గురువారం ఉపాధ్యాయ దినోత్సవేడుకలు సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య పద్మావతి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి అధికారులతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రసంగించారు. ఆయన మాట్లాడుతూ రాధాకృష్ణన్ జన్మదినాన్ని పురస్కరించుకొని ఉపాధ్యాయ దినోత్సవాన్ని జరుపుకుంటున్నామని, ఆయన ఉత్తమ ఉపాధ్యాయులుగా గుర్తింపు పొంది గురుతర బాధ్యతను దేశం గర్వించేలా నిర్వహించిన మహానీయులన్నారు. అబ్దుల్ కలాం ఉపాధ్యాయుడిని క్యాండిల్ వెలుగుతో పోల్చారని, తాను కరగుతున్నా వెలుగునిచ్చేది గురువేనని తెలిపిన విషయాన్ని గుర్తు చేస్తారు. వర్సిటీ సాంకేతికత పరంగా వృద్ధి చెందిందని, కృత్రిమ మేధస్సు, క్వాంటమ్ టెక్నాలజీతో మరింత అభివృద్ధిపథంలో నడిచేందుకు అడుగులు వేస్తోందన్నారు. రిజిస్ట్రార్ భూపతి నాయుడు మాట్లాడుతూ గురువులు నిత్య విద్యాదాతలని, గురువును దేవుడిగా సమాజం భావిస్తుందన్నారు.

**ఉత్తమ ఉపాధ్యాయులు అవార్డులు:** ఎస్వీయూలో 2025 ఏడాదికి ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన అధ్యాపకులు ఆచార్య ప్రయాగ, ఆచార్య చంద్రశేఖరయ్య, ఆచార్య నారాయణ, డాక్టర్ పద్మజ, డాక్టర్ సునీత, ఆచార్య చంద్రాయుడు, ఆచార్య జ్యోతి, ఆచార్య సరోజమ్మ, ఆచార్య నాగజ్యోతి, డాక్టర్ హేమలత, రుద్రమదేవి, డాక్టర్ స్వరూపరాణి, డాక్టర్ శ్రీదేవి, డాక్టర్ రమేష్ బాబు, డాక్టర్ విజయలక్ష్మి, ఆచార్య సుబ్బారావు, ఆచార్య రమశ్రీ, ఆచార్య సుధారాణి, ఆచార్య హేమ, ఆచార్య అఖిల స్వతంత్రకు అవార్డులు అందజేశారు. అనంతరం 2024 రాష్ట్ర ఉత్తమ అవార్డుల గ్రహీతలను సన్మానించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించి సాంస్కృతిక కార్యక్రమాలు వీక్షకులను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్స్ ప్రొఫెసర్ సుధారాణి, ఓవీఎల్రెడ్డి, ప్రొఫెసర్ వెంకటేశ్వర్లు, ప్రొఫెసర్ శ్రీనివాసులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.






## సురుటుపల్లి ట్రస్టు బోర్డు నియామకంపై ఆశావహుల దరఖాస్తుల పరిశీలన

**సత్యవేడు, మేజర్‌న్యూస్:** తిరుపతి జిల్లా సత్యవేడు నియోజవర్గం నాగలాపురం మండలం సురుటుపల్లి శ్రీపల్లికొండేశ్వరస్వామి ఆలయ ధర్మకర్తల మండలి నియామకం కోసం ఆశావహులు నుంచి అందిన దరఖాస్తులను దేవాదాయ శాఖ అధికారుల బృందం పరిశీలించారు.గురువారం ఆలయ కార్య నిర్వహణ అధికారి కార్యాలయంలో ఈవో లత ఆధ్వర్యంలో జిల్లా దేవాదాయ శాఖ అధికారి రామ కృష్ణారెడ్డి, దేవాదాయ శాఖ టెంపుల్ ఇన్స్పెక్టర్ ఫణిరాజసయన, జూనియర్ అసిస్టెంట్ దినేష్ బృందం దరఖాస్తులను పరిశీలించింది. ఈ క్రమంలో ట్రస్ట్ బోర్డు నియామకానికి సంబంధించి 104 దరఖాస్తులు అందగా, 83 మంది దరఖాస్తు పరిశీలనకు హాజరైనట్టు దేవాదాయ అధికారులు పేర్కొన్నారు.ప్రధానంగా అధికారుల బృందం దరఖాస్తుదారుల సమర్పించిన కుల ధ్రువీకరణ పత్రం, విద్యా అర్హత,ఆలయానికి విరాళాలు,అఫిడవిట్ , నేరాలకు సంబంధించిన వ్యక్తిగత ఆఫిడవిట్ వంటివి పరిశీలించారు.కాగా మిగిలిన 21 మంది దరఖాస్తు పరిశీలనకు గైరాజరయ్యారు.అయితే మిగిలిన దరఖాస్తులను కూడా సెప్టెంబర్ ఆరో తేదీన ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒక గంట వరకు దేవాదాయ అధికారుల బృందం పరిశీలించడం జరుగుతుందని ఈ సందర్భంగా ఆలయ ఈవో లత పేర్కొన్నారు.గురువారం గైరాజరైన వారు శనివారం దరఖాస్తు పరిశీలనకు హాజరుకావాలని కోరారు.



## ఎస్వీయూలో ఆరుగురుకి రాష్ట్ర స్థాయి ఉత్తమ అవార్డులు

**తిరుపతి ఎడ్యుకేషన్, మేజర్ న్యూస్:** ఎస్వీయూలో పనిచేస్తున్న ఆరుగురు అధ్యాపకులకు రాష్ట్ర స్థాయి ఉత్తమ అవార్డులు వరించాయి. ఇందులో పాపులేషన్ స్టడీస్ అండ్ సోషియల్ వర్క్ విభాగం అధ్యాపకులు టి చంద్రశేఖరయ్య, బయెకెమిస్ట్రీ విభాగం అధ్యాపకులు ఎం బాలాజీ, బాటనీ విభాగం అధ్యాపకులు టి విజయ, కంప్యూటర్సైన్స్ ఇంజనీరింగ్ అధ్యాపకులు డీవీ సుబ్బారావు, ఈసీఈ విభాగం అధ్యాపకురాలు టి రమశ్రీ, కెమికల్ ఇంజనీరింగ్ విభాగం ప్రొఫెసర్ పి అఖిల స్వతంత్ర ఉన్నారు. అలాగే ఎస్వీ డబ్ల్యు డిగ్రీ కళాశాల జువాలజీ అధ్యాపకులు, శ్రీపద్మావతి జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సి భువనేశ్వరి దేవికి రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు వరించింది. వీరందరికీ విజయవాడ వేదిక శుక్రవారం జరిగే ఉపాధ్యాయ దినోత్సవంలో విద్యాశాఖ మంత్రి, అధికారుల చేతుల మీదుగా ఉత్తమ అవార్డులు స్వీకరించనున్నారు.



## ప్రొఫెసర్ సుబ్రహ్మణ్యంకు ఉత్తమ పురస్కారం



**తిరుపతి ఎడ్యుకేషన్, మేజర్‌న్యూస్:** శ్రీవెంకటేశ్వర వ్యవసాయ కళాశాలలో అగ్రోనమీ విభాగం ప్రొఫెసర్ డా.డి.సుబ్రహ్మణ్యంకు రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు వరించింది. ఆయన విద్యార్థులకు అందించిన సేవలకు గాను రాష్ట్ర ప్రభుత్వం అవార్డుకు ఎంపిక చేసింది. ఈ సందర్భంగా అధ్యాపకులు విద్యార్థులు అభినందనలు తెలియజేశారు.

## అత్యాచారయత్నం కేసులో నిందితుడు అరెస్ట్

**వెదురుకుప్పం, మేజర్‌న్యూస్:** మైనర్ బాలికపై అత్యాచారయత్నానికి పాల్పడిన ప్రసాద్ అనే నిందితుడిని గురువారం మధ్యాహ్నం అరెస్టు చేసి రిమాండ్ కు పంపినట్లు కార్వేటినగరం సర్కిల్ ఇన్స్పెక్టర్ హనుమంతప్ప, వెదురుకుప్పం ఎస్సై వెంకటసుబ్బయ్యలు తెలిపారు. సీఐ విలేకరులకు తెలిపిన వివరాలు మేరకు బ్రాహ్మణపల్లి గ్రామానికి చెందిన ఓ విద్యార్థి చదువు నిమిత్తం వెదురుకుప్పం పాఠశాలకు రావడానికి తమ ఇంటి వద్ద బుధవారం నిలుచుని ఉంది. బాలికను తమ ద్విచక్ర వాహనములో వెదురుకుప్పం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు తీసుకువెళతానని బ్రాహ్మణపల్లి గ్రామానికి చెందిన ప్రసాద్ నమ్మబలికాడు. విద్యార్థి నమ్మి ప్రసాద్ ద్విచక్ర వాహనాన్ని ఎక్కి కూర్చుంది. కమ్మకండిగా సమీపంలోని నాగరాజు మామిడి చెట్లు వైపు ప్రసాద్ తన ద్విచక్ర వాహనాన్ని మళ్లించాడు. ఎవరూ లేరని భావించి తమ ద్విచక్ర వాహనాన్ని నిలుపుదల చేసి బాలికపై ప్రసాద్ అత్యాచారయత్నానికి పాల్పడ్డాడు. బాలిక ప్రసాద్ నుండి తప్పించుకుని వెదురుకుప్పం వైపు వెళుతుండగా, బాలికను ప్రసాద్ వెంబడించాడు. బాలికను జరిగిన విషయాన్ని ఎవరికైనా చెబితే చంపేస్తానని బెదిరించి పాఠశాలల్లో దింపేస్తానని తమ వాహనంలో ఎక్కించుకుని పాఠశాల వద్ద దింపి పరారయ్యాడు. జరిగిన విషయాన్ని విద్యార్థి ప్రధానోపాధ్యాయులకు తెలియజేసింది. ప్రధానోపాధ్యాయులు విద్యార్థిని కుటుంబానికి సమాచారాన్ని చేరవేయడంతో కుటుంబంలోని తల్లి, మేనమామ బాబు వెదురు కుప్పం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు కార్వేటినగరం సిఐ సమగ్రమైన దర్యాప్తు జరిపించి నిందితుడిని గురువారం ఇనాం కొత్తూరు సమీపంలో మధ్యాహ్న 3 గంటల పైగా అరెస్టు చేసి అతని వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు. నిందితుడిని రిమాండ్ నిమిత్తం పుత్తూరు కోర్టుకు తరలించినట్లు సిఐ తెలిపారు. మైనర్ బాలికలు, మహిళలపై అత్యాచారయత్నాలకు పాల్పడే వ్యక్తులపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోనున్నట్లు కార్వేటినగరం సిఐ హనుమంతప్ప హెచ్చరించారు. అవసరమైతే రౌడీషీటర్లతోపాటు, పిడి యాక్ట్‌ను నమోదు చేయనున్నట్లు హెచ్చరించారు. కార్యక్రమంలో వెదురుకుప్పం ఎస్సై వెంకటసుబ్బయ్య, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



# రైతులను తెలుగుదేశం పార్టీ దగా చేస్తోంది

## రాష్ట్ర వైసీపీ జాయింట్ సెక్రెటరీ కొణిదల సుధీర్



నెల్లూరు, మేజర్‌న్యూస్ : యూరియాను కృత్రిమ కొరత సృష్టించి రైతులను కూటమి ప్రభుత్వం దగా చేస్తుందని రాష్ట్ర వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జాయింట్ సెక్రెటరీ కొణిదల సుధీర్ ఆరోపించారు. గురువారం నెల్లూరు రాంజీ నగర్ వైఎస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ నగర నియోజకవర్గ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వంలో రైతుల పరిస్థితి దయనీయంగా మారిందని పేర్కొన్నారు. బ్లాక్ మార్కెట్లో అధిక ధరలు వెచ్చించి యూరియా కొనలేక రైతులు పడే బాధలు వర్ణనాతీతమన్నారు. రైతుల దయనీయ పరిస్థితులకు తెలుగుదేశం పార్టీ నేతలే కారణమన్నారు. రాష్ట్రంలో రైతులు ఇంతటి ఇబ్బందులు ఎదుర్కొంటుంటే వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్న నాయుడు పత్తా లేకుండా పోయారని అన్నారు. ఇటీవల మంత్రి ఎరువుల కొరతపై స్పందిస్తూ ప్రైవేట్ సంస్థలకు ఎక్కువ శాతం యూరియా అందించడం మూలంగానే యూరియా కొరత ఏర్పడిందని మాట్లాడడం సిగ్గుచేటు అన్నారు. కేంద్రం రాష్ట్రానికి కేటాయించిన యూరియాను కూడా తెలుగుదేశం పార్టీ నేతలు తమ కనుసన్నల్లో ఉంచుకొని కృత్రిమ కొరత సృష్టించి యూరియాను బ్లాక్ మార్కెట్‌లో అమ్మి సొమ్ము చేసుకుంటున్నారని మండిపడ్డారు. దోచుకో దాచుకో అన్న నినాదంతో తెలుగుదేశం పార్టీ పనిచేస్తుందన్నారు. ఒక్కో యూరియా బస్తా ధర 270 రూపాయలు ఉంటే దాన్ని బ్లాక్ మార్కెట్‌కు తరలించి 300 నుంచి 400రూపాయలు అధిక ధరకు టిడిపి నేతలు బ్లాక్ మార్కెట్లో అమ్మి సొమ్ము చేసుకుంటున్నారని ధ్వజమెత్తారు. ప్రభుత్వ విజిలెన్స్ విభాగం ఉన్నప్పటికీ యూరియా బ్లాక్ మార్కెట్‌కు తరలి వెళ్లడాన్ని అడ్డుకోలేకపోయారని తెలిపారు. యూరియా బ్లాక్ మార్కెట్ సొమ్ము సుమారుగా 200 నుంచి 300కోట్ల రూపాయలు చేతులు మారుతున్నాయన్నారు. బ్లాక్ మార్కెట్ దందాను నిలువరించాల్సిన మంత్రి రైతులను అవహేళన పరుస్తూ బఫే లంచ్‌ల్లో క్యూ లైన్‌లో నిలుచుంటారా యూరియా కోసం క్యూ లైన్‌లో నిల్చోలేరా అని రైతుల పట్ల అమర్యాదగా మాట్లాడడం రైతులను అవమానించడమేనన్నారు. మంత్రి వ్యాఖ్యలను ఈ రాష్ట్ర రైతాంగం క్షమించదన్నారు. గతంలో వైయస్ రాజశేఖర్‌రెడ్డి ఈ రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా రైతేరాజు అన్న నినాదంతో రైతులకు ఎన్నో సేవలు అందించారని తెలిపారు. వైయస్ రాజశేఖర్‌రెడ్డి ఆశయంతో వచ్చిన వైయస్ జగన్మోహన్‌రెడ్డి గత ఐదు సంవత్సరాల వైసీపీ పాలనలో రైతుభరోసా కేంద్రాలను తీసుకువచ్చి రైతులకు సకాలంలో యూరియా, ఎరువులు అందించి రైతు సంక్షేమానికి కృషి చేశారని తెలిపారు. కూటమి ప్రభుత్వంలో రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులకు సంఘీభావంగా మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి పిలుపు మేరకు ఈనెల 9వ తేదీన వైఎస్‌ఆర్‌పి నెల్లూరు జిల్లా అధ్యక్షులు కాకాని గోవర్ధన్ రెడ్డి, నెల్లూరు సిటీ ఇన్‌చార్జ్ ఎమ్మెల్సీ పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, కోవూరు నియోజకవర్గ ఇన్చార్జి నల్లపురెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి, నెల్లూరు రూరల్ నియోజకవర్గం ఇన్‌చార్జ్ ఆనం విజయకుమార్ రెడ్డి ఆధ్వర్యంలో సర్వేపల్లి నెల్లూరు సిటీ కోవూరు నెల్లూరు రూరల్ నియోజకవర్గ వైఎస్ఆర్ సీపీ నేతలు, రైతులతో కలిసి రైతు సమస్యలను వివరిస్తూ ఆర్డీఓకి వినతిపత్రం అందజేయడం జరుగుతుందని తెలిపారు. ఈ సమావేశంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నేతలు, కార్యకర్తలు, రైతులు, తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.

సూర్య

# విలేకర్లు కావలెను

తెలుగు పత్రిక రంగంలో అందరి మన్ననలు పొంది పాఠకుల హృదయాలను దోచుకున్న నేటి దినపత్రిక సూర్య నందు విలేకర్లుగా పనిచేయుటకు ఉత్సాహవంతులైన యువతీ యువకులు కావలెను.

కావలసిన సెంటర్లు

నెల్లూరు జిల్లాలోని సంగం, కొడవలూరు, మనుబోలు, అల్లూరు, దగదర్తి, కొండాపురం, కలిగిరి, కలవాయి, విడవలూరు, ఇందుకూరుపేట, కోవూరు, నెల్లూరు పట్టణంలోని దర్గామిట్ట, స్టోన్ హౌస్‌పేట, బాలాజీ నగర్‌లలో విలేకర్లు కావలెను

మీ పూర్తి బయోడేటాతో వారంలోపు క్రింది చిరునామాలో సంప్రదించగలరు.

నేటి దినపత్రిక సూర్య కార్యాలయం

మిలటరీ కాలనీ, రోడ్ నెం.1,ఎల్ఐసి & సిడిఓ ఆఫీసు ఎదురుగా, కొండాయపాలెం గేట్ సెంటర్, నెల్లూరు

9000118811, 9000483583

## హెడ్‌మాస్టర్ బలరామయ్యకు రాష్ట్ర స్థాయి అవార్డు



బోగోలు, మేజర్‌న్యూస్ : బోగోలు మండలం ఎస్వీపాలెం వాస్తవ్యులు అన్నంగి బలరామయ్యకు ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఉత్తమ ఉపాధ్యాయునిగా రాష్ట్ర స్థాయి అవార్డు త్రేతాయుగ్ ఫౌండేషన్ న్యూఢిల్లీ వారు ప్రధానం చేయడం జరిగింది. వరికుంటపాడు మోడల్‌స్కూల్ హెడ్ మాస్టర్‌గా అంకిత బావంతో పని చేస్తూ విద్యార్థిని విద్యార్థుల ప్రతిభను పెంపొందే విదంగా పనిచేస్తున్న బలరామయ్యను డిల్లీ వారు గుర్తించి అవార్డ్ ప్రకటించినందుకు పలువురు అభినందించడం జరిగింది. ఈ సందర్భంగా స్థానిక స్వచ్ఛంద సంస్థ డైరక్టర్ కట్టిపల్లి సింహాద్రి రావు మాట్లాడుతూ.. బలరామయ్య వృత్తి పట్ల అంకితభావంతో పనిచేసే వ్యక్తి అని అటువంటి వ్యక్తికి అవార్డ్ రావడం అభినందనీయం అన్నారు. అవార్డు గ్రహిత బలరామయ్య మాట్లాడుతూ.. అవార్డ్ బాధ్యతను పెంచిందని అన్నారు.

## రంగనాథుని పవిత్రోత్సవాలలో నాల్గవ రోజు



నెల్లూరు కల్చరల్, మేజర్‌న్యూస్ : నెల్లూరు రంగనాయకులపేటలో వెలసియున్న శ్రీ తల్పగిరి రంగనాథ స్వామి వారి దేవస్థానం నందు పవిత్రోత్సవాలు సందర్భంగా 4వ రోజు గురువారం ఉదయం 9.30 గంటలకు నిత్యహోమాలు, 11.30 గంటలకు తీర్థప్రసాద వినియోగం నిర్వహించడం జరిగింది. సాయంత్రం 5.30 గంటలకు గోపురోత్సవం రాత్రి 7.00 గంటలకు హోమాలు, తీర్థ ప్రసాదాలు వినియోగము నిర్వహించడం జరిగింది. ఉభయకర్తలు 'కార్య నిర్వహణాధికారి, ఆరణి కందప్ప మేస్త్రి సత్రం, నెల్లూరు' వారు వ్యవహరించినారు. ఈ కార్యక్రమానికి దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఆళ్ళ శ్రీనివాస రెడ్డి, దేవస్థానం అర్చకులు, సిబ్బంది, భక్తులు పాల్గొనడం జరిగింది.

## రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయురాలుగా ఆచార్య సుజా ఎస్.నాయర్



వెంకటాచలం, మేజర్‌న్యూస్ : కాకుటూరులోని విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం ఎంబీఏ విభాగం అధ్యాపకురాలు ఆచార్య సుజా ఎస్.నాయర్ రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును అందుకున్నారు. ఈ విజయంతో విశ్వవిద్యాలయం గర్వకారణంగా నిలిచింది. ఈ సందర్భంగా విశ్వవిద్యాలయ వైస్–చాన్సలర్ ఆచార్య అల్లం శ్రీనివాసరావు, రిజిస్ట్రార్ డా. కె.సునీత, కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య సి.హెచ్. విజయ, అధ్యాపకులు, సిబ్బంది ఆమెకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. వైస్–చాన్సలర్ మాట్లాడుతూ.. ఆచార్య సుజా ఎస్.నాయర్ వినూత్న బోధనా పద్ధతులు, విద్యార్థుల అభ్యున్నతికి అంకితభావం విశ్వవిద్యాలయానికి గర్వకారణం. ఈ అవార్డు ఆమె కృషికి నిదర్శనం' అని అన్నారు.రిజిస్ట్రార్ డా. కె.సునీత మాట్లాడుతూ.. ఈ అవార్డు వలన మా విశ్వవిద్యాలయ ప్రతిష్ఠ మరింతగా పెరిగింది. ఇతర అధ్యాపకులకు ఇది స్ఫూర్తిదాయకం అవుతుంది అని పేర్కొన్నారు.

## విద్యార్థులు లక్ష్యంతో ముందుకు సాగాలి : ఎమ్మెల్యే కాకర్ల సురేష్



ఉదయగిరి, మేజర్‌న్యూస్ : విద్యార్థులకు జన్మనిచ్చిన తల్లిదండ్రుల తరువాత స్థానం ఉపాధ్యాయులదేనని, పాఠశాలలో వారి చెప్పేది శ్రద్ధగా విని ఓ లక్ష్యంతో కష్టపడి చదివి బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని ఎమ్మెల్యే కాకర్ల సురేష్ పేర్కొన్నారు. గురువారం ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో నాబార్డు నిధులు రూ.1.18 కోట్లతో నిర్మించిన అదనపు తరగతి గదులను జాయింట్ డైరెక్టర్ మువ్వా రామలింగం, సర్వశిక్ష అభియాన్ ఏపీసీ వెంకట సుబ్బయ్యలతో కలిసి ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ బాబు విద్యావ్యవస్థపై ప్రత్యేక దృష్టిసారించారన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో ప్రభుత్వం విద్యాభివృద్ధికి కోట్లాది రూపాయలు ఖర్చు చేసి విద్యార్థులకు ఆధునాతన పద్ధతులతో విద్యనందిస్తుందన్నారు. విద్యార్థిమిత్ర కిట్లను స్వయంగా ఆయనే పరిశీలించి నాణ్యత కలిగినవి ఎంపిక చేశారన్నారు. ప్రభుత్వ పాఠశాలలో సీటు కావాలంటే ప్రజాప్రతినిధులు, అధికారులు సిఫార్సు చేయాల్సిన పరిస్థితి తీసుకురావడమే ప్రభుత్వ ధ్యేయమన్నారు. పాఠశాల ఆవరణలో మొక్కలు పెంచి పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. పాఠశాలకు అవసరమైన ప్రహరీ, సీసీరోడ్ల నిర్మాణానికి చర్యలు చేపడతానన్నారు. తొలుత ఆయన జూనియర్ కళాశాలను సందర్శించి విద్యార్థులు, అధ్యాపకులతో ముచ్చటించారు. కళాశాలలో ఎదుర్కొంటున్న ఇబ్బందులను ప్రిన్సిపాల్ ఆయన దృష్టికి తీసుకెళ్లడంతో పరిష్కారానికి చర్యలు తీసుకొంటామని హామీ ఇచ్చారు. అనంతరం కావలి మార్గంలో గల ఎస్టీ కాలనీలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహం వద్ద అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శులు పి.చెంచలబాబుయాదవ్, మన్నేటి వెంకటరెడ్డి, మండల టీడీపీ కన్వీనర్ బయ్యన్న, సొసైటీ అధ్యకుడు గడ్డం వెంకట సామయ్య టీడీపీ నాయకులు రియాజ్, బొజ్జ నరసింహులు, నల్లిపోగు రాజా, బొల్లా శ్రీనివాసులు, తుమ్మల కిరణ్, గడ్డం శ్రీను తహశీల్దారు రామ్మోహన్, ఎంపీడీవో అప్పాజీ, ఎంఈవోలు శ్రీనివాసులు, వెం కటేశ్వర్లు, హెచ్ఎం జీ.శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా సుబ్రహ్మణ్యం



వింజమూరు, మేజర్‌న్యూస్ : వింజమూరు నివాసి అయిన తాళ్లపాలెం సుబ్రహ్మణ్యం జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులు గా ఎంపికైనట్టు జిల్లా విద్యాశాఖ అధికారి ఒక ప్రకటనలో తెలియజేశారు. వీరికి ఈనెల ఐదో తేదీన ఉపాధ్యాయ దినోత్సవ సందర్భంగా నెల్లూరు కలెక్టర్ కార్యాలయంలో ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం అందిస్తున్నట్లు తెలియజేశారు. సుబ్రహ్మణ్యం గత 17 సంవత్సరాలు సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులుగా పనిచేస్తూ వినూత్న కార్యక్రమాలు పాఠశాలలో నిర్వహిస్తూ విద్యార్థులను పోటీ పరీక్షలు వైపు ఎన్ఎంఎంఎస్ వంటి జాతీయ స్కాలర్‌షిప్ పరీక్షలుకి శిక్షణ ఇస్తూ అనేక మందికి స్కాలర్షిప్ సాధించడంలో తోడ్పడ్డారు. మీరు ప్రస్తుతం జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాల సంగం నందు పనిచేస్తూ ఉన్నారు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం అందుకుంటున్న సందర్భంగా పలువురు అధికారులు ఉపాధ్యాయులు ఆయనకి శుభాకాంక్షలు అభినందనలు తెలియజేశారు.